
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 21 మే 2024 3



ఇసుక అక్రమాలే లేవట?

సుప్రీంకోర్టుకు జిల్లా అధికారుల నివేదిక

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఇసుక అక్రమాలు లేవు. ప్రస్తుతం 16 ఓపెన్ రీచ్‌లలో తవ్వకాలు జరగడంలేదని జిల్లా అధికారులు సుప్రీంకోర్టుకు నివేదిక సిద్ధం చేశారు. ఈ నివేదికను మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ ద్వారా సుప్రీంకోర్టుకు పంపించనున్నారు. ఆదివారం ఉరుకులు, పరుగులతో వర్షంలో తడుస్తూ అధికారులు ర్యాంపులను పరిశీలించిన సంగతి తెలిసిందే. అక్కడ ప్రస్తుతం ఇసుక తవ్వకాలు ఆగిపోయినప్పటికీ..అప్పటివరకూ జరిగిన తవ్వకాల ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వాటిని అధికారులు పట్టించుకోలేదు. పెద్దపెద్ద గుట్టలుగా అక్రమ తవ్వకాల ఇసుక స్టాక్ పాయింట్లు కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నా వాటిని పట్టించుకోలేదు. ర్యాంపుల సమీపంలో ఈ గుట్టలు ఉన్నా ఏ మాత్రం అక్రమాలు జరగలేదని అధికారులు నివేదిక సిద్ధం చేయడం గమనార్హం. ఇసుక డీపీడీపై అధికారులు విచారణ చేసి ఇంత వరకూ ఏమి జరిగిందో కూడా నివేదికలో ఇవ్వాలి. కానీ అక్కడ ఏమీ జరగడం లేదని మాత్రమే ఇవ్వడం గమనార్హం. అంటే అధికార వైసీపీ ఒత్తిడికి అధికారులు ఎంతగా భయపడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

తూచ్..తూగోజిది కాదు.. 5



నన్నయలో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్

కౌంటింగ్ ప్రక్రియ అంతా వీడియో తీస్తాం

- 4న 5 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం
- కౌంటింగ్ కేంద్రం వద్దకు సెల్ అనుమతించం
- రౌండ్స్ వారీగా సమాచారం అందజేత
- వాహనాలకు అనుమతి ఉండదు
- ఆర్‌వోలతో సమీక్షలో కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ, మే 20 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పట్ల అత్యంత జాగ్రత్త వహించాలని అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కే.మాధవీలత సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై సోమవారం ఆర్‌వోలకు శిక్షణ ఇచ్చారు. నన్నయ వర్శిటీలో ఓట్ల లెక్కింపు జరిగే సమయంలో కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్‌లు అనుమతించరాదన్నారు. ఆర్‌వో సెల్‌ఫోన్‌కు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. వాటి ద్వారానే రౌండ్స్ వారీగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మీడియా సెంటర్ వరకు మొబైల్ ఫోన్‌లు అనుమతించవచ్చని తెలిపారు. సీసీ టీవీ కెమెరాల నిఘా లో కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు.రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు వివరాలు ఎన్కోర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఐదు వీవీ ప్యాట్స్ ఓటర్ స్లిప్స్ ర్యాండమ్‌గా ఎంపిక చేసి లెక్కింపు జరపాలన్నారు. నన్నయ వర్శిటీలోకి ఎటువంటి వాహనాలు అనుమతించరాదన్నారు. వర్శిటీ ప్రధా న ద్వారం వద్ద ఏర్పాటు చేసిన నాలుగు ఏసీ బస్సుల ద్వారా సిబ్బంది లోపలికి చేరుకుంటారన్నారు. జూన్ 4న ఉదయం 5గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఒక్కొక్క కౌంటింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 14 మంది ఏజెంట్లను అనుమతిస్తారని చెప్పారు. ఫారం -17 సీలో నమోదు చేసిన ఓట్లను ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల సంఖ్యతో సరిచూస్తారని ,కౌటింగ్ సిబ్బంది ఆ సంఖ్య ఫారం 17 సీ పార్ట్ 2 నోట్ చేసుకుని దానిపై ఏజెంట్ల సంతం తీసుకుంటారన్నారు. అనంతరం ఈవీఎంల సీల్ తొలగించి రిజల్ట్ బటన్ నొక్కుతారన్నారు. ఈవీఎంలో పోలైన ఓట్లలో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయనే విషయం తెలుస్తుందన్నారు. ఒక్కొక్క రౌండ్‌లో ఏ అభ్య ర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయనే వివరాలను కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన బోర్డుపై సిబ్బంది రాస్తారని ,ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీసి భద్రపరుస్తారని తెలిపారు. శాంతియుతంగా లెక్కింపు ప్రక్రియ నిర్వర్తించడంలో అందరు సమష్టి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. జేసీ తేజ్ భరత్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లపై లేఅవుట్, రిటర్నింగ్ అధికారుల బాధ్యతలు ,నిర్వహించాల్సిన విధులు, భౌతిక ఏర్పాట్లపై సమగ్ర సమాచారాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో రాజమహేంద్ర వరం రూరల్, సిటీ ఆర్‌వోలు తేజ్ భరత్, దినేష్ కుమార్, కొవ్వూరు ఆర్‌వో అశుతోష్ శ్రీవాత్సవ్, డీఆర్‌వో జి.నరసింహులు, రాజానగ రం ఆర్‌వో చైత్రవర్షిణి, గోపాలపురం ఆర్‌వో శివజ్యోతి, అనపర్తి ఆర్‌వో ఎం. మాధురి, నిడదవోలు ఆర్‌వో రమణానాయక్, రాజమహేంద్రవరం పార్లమెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్‌డీసీ ఆర్.కృష్ణానాయక్, ట్రైనీ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు : ఎస్పీ

దివాన్‌చెరువు, మే20 : నన్నయ విశ్వవిద్యాలయంలో ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత , ఎస్పీ జగదీశ్ తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం ను సందర్శించి సోమవారం సాయంత్రం ఎస్పీ పి.జగదీశ్‌తో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వర్తించడంలో జవాబుదారీతనం, పారదర్శకతతో కూడిన ఏర్పాట్లు విష యంలో ఖచ్చితత్వం పాటించే విధానంలో చేపట్టవలసిన వాటిపై దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. మూడంచెల భద్రత నేపథ్యంలో చేపడు తున్న కార్యకలాపాలపై ఎస్పీ జగదీశ్‌తో కలిసి సమీక్ష నిర్వహించామన్నారు. అనంతరం విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకం చేశారు.స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి లెక్కింపు కేం ద్రానికి ఈవీఎంలు తీసుకు వచ్చే రూట్‌మ్యాప్‌పై చర్చించారు.



జిల్లా స్థాయి శిక్షణకు హాజరైన ఆర్‌వోలు

అర్చకుడి ఇంట్లో 30 కాసుల బంగారం చోరీ 6

గోదారిలో.. గరళం





అపవిత్రమవుతుందిలా: రాజమహేంద్రవరంలో మురుగంతా గోదావరిలో కలిసేలా ఏర్పాటు చేసిన నల్లా చానల్ పైప్‌లైన్

అఖండ గోదావరి.. అపవిత్రం

- రాజమండ్రిలో కలుస్తున్న మురుగు
- కలుషితమవుతున్న నీరు
- ఆ నీరే శుద్ధి చేసి తాగునీటిగా సరఫరా
- రోగాలతో ప్రజలు సతమతం
- నేటికీ పట్టించుకోని పాలకులు

పవిత్ర గోదావరి నీటి కోసం లక్షలాది మంది ఎదురు చూస్తున్నారు..ఆ నీరు కావాలంటూ అర్రులు చాస్తున్నారు.. అయితే రాజమహేంద్రవరంలో జరుగుతున్నది చూస్తే మాత్రం ఆ నీరు మాకొద్దు బాబోయ్ అంటారు. ఎందుకంటే.. రాజమహేంద్రవరం నగర ప్రజలు వాడిన నీటినే మళ్లీ శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. దీంతో చారిత్రక రాజమహేంద్రవరం నగరం సురక్షిత తాగునీటి సమస్యతో కొట్టుమిట్టాడుతోంది. నగరంలో 50 డివిజన్లలో సుమారు 4 లక్షల పైబడి జనాభా ఉన్నారు. గోదావరి పక్కనే ఉన్నా తాగునీటికి అల్లాడిపోతున్నారు. ఎందుకంటే నగరంలో 50 డివిజన్లకు నీటి సరఫరా చేసే ప్రధాన మంచినీటి విభాగానికి నగర ప్రజలు వాడిన నీరు కలిసే ప్రాంతానికి దూరం సుమారు 600 మీటర్లు మాత్రమే.. నగర ప్రజలు వాడిన నీరు గోదావరిలో కలిసే నల్లా చానల్ పాయింట్ గోదావరి ప్రవాహానికి ఎగువన ఉండగా, తాగునీటి కోసం లిఫ్ట్ చేసే ప్రధాన మంచినీటి విభాగం దిగువన ఉంది. దీంతో గోదావరి నీటిలో కలిసిన మురుగు నీటినే శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. ఆ నీటినే అందరూ తాగేస్తున్నారు.. పాలకులు మాత్రం ఆ మురుగునీరు కలిసే పాయింట్ మార్చేందుకు చర్యలు చేపట్టడం లేదు.



మురుగు గోదారిలో కలిసేదిలా

రాజమహేంద్రవరం సిటీ, మే 20 : పవిత్రమైనది గోదావరి.. పేరులోనే పవిత్రం.. నదిలో మాత్రం ఆ పవి త్రత కానరావడం లేదు.. అధికారుల అలక్ష్యం.. పాలకుల నిర్లక్ష్యం.. అఖండ గోదావరికి శాపంగా మారాయి.. గోదా వరి నీటిలో ఏముంటుందో ఒక్కసారైనా నదిలో పుణ్యస్నానం చేయాలనే స్థాయి నుంచి..ఆ నీటిలో అడుగు పెడితేనే సర్వరోగాలు వస్తాయనే స్థాయికి దిగజారి పోయింది.. దీనికి కారణం పాలకులే.. ఎందుకంటే రాజమ హేం ద్రనగర ప్రజలు వాడే మురుగంతా కలిసేది జనం పవిత్రంగా భావించే గోదావరిలోనే.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే అతి ఎక్కువ ఆదాయం కలిగిన కార్పొ రేషన్ అయినా.. నేటికీ సమస్యకు మాత్రం పరిష్కారం చూపలేక పోయారు.. పైపై మెరుగులు అద్ది అభివృద్ధి చేసినట్టు చెప్పే పాలకులు గోదావరి పవిత్రత అపవిత్రమవుతున్నా కనీసం కన్నెత్తి చూడలేదు. రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి(గౌతమి) ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద ఏడు పాయలుగా విడిపోతోంది. అవి గౌతమి, వశిష్ఠ, వైనతేయ, ఆత్రేయ, భరద్వాజ, తుల్యభాగ, కశ్యప అనే సప్తర్షుల పేర్లతో పిలుస్తారు. అందుకే అంత పవిత్రత.. ఇందులో గౌతమి, వశిష్ఠ, వైనతేయ మాత్రమే ప్రవహించే నదులు.. మిగిలినవి అంతర్వాహినులు.. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది వద్ద సముద్రంలో కలుస్తోంది..అక్కడకు చేరే వరకూ గొంతు తడి పేందుకు ఈ నీరే.. చేను తడిపేందుకు ఈ నీళ్లే దిక్కు.. అంత ప్రాధాన్యత ఉన్న గోదావరి రాజమహేంద్రవరం మురుగుతో అపవిత్రం అవుతున్నా కనీసం కదలిక లేదు.

గోదారున్నా.. తప్పని దాహం కేకలు

రాజమహేంద్రవరంలో అతి ముఖ్యమైనది సురక్షిత తాగునీటి సమస్య. దీనిని పరిష్కరించడంలో ఏ ఒక్కరు సఫలీకృతులు కాలేకపోయారు. టీడీపీ హయాంలో దిగువన ధవళేశ్వరం విజయ డైరీ ఎదురుగా ఒక 10 ఎమ్ఎల్‌డీ ప్లాంట్, కోటిలింగాల పేట టింబర్ యార్డ్‌లో ఒక 10 ఎమ్ఎల్‌డి ప్లాంట్ నిర్మాణాలు జరిగాయి. కానీ ప్రధాన మంచినీటి విభాగాన్ని గోదావరి ఎగువకు తరలించలేదు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినా అనంతరం వచ్చిన ప్రభుత్వాల వల్ల కార్యరూపం దాల్చలేదు.పూర్వపు కమిషనర్ విజయరామరాజు ప్రధాన మంచినీటి విభాగం ఇన్‌టెక్ పాయింట్‌ను పైప్‌ల ద్వారా నదిలోకి తీసుకువెళ్లారు.కానీ నల్లా చానల్ గోదావరి మలుపులో ఉండడం వల్ల మురునీరు ప్రవాహం గోదావరి ఒడ్డు నుంచి మధ్య వరకు ప్రవహిస్తుంది. ఎలాగైనా ముగురునీరే తగులుతుంది. దీంతో ఆ మురుగునీరే శుద్ధి చేసి సరఫరా చేసే పరిస్థితి ఉంది. ప్రధాన మంచి నీటి విభాగం నుంచి 65 ఎంఎల్‌డీ వాటర్, మిగిలిన రెండు చోట్ల నుంచి 20 ఎమ్ఎల్‌డీ వాటరు కలిపి మొత్తం నగరంలో 85 ఎమ్ఎల్‌డీ వాటర్‌ను శుద్ధి చేసి నగర ప్రజలకు అందిస్తున్నారు.వేసవి వచ్చిందంటే గోదావరిలో నీరు తగ్గి కొంత ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి. తాగునీటి కొరత ఏర్పడుతుంది.

నూతన ప్రజాప్రతినిధులకు సవాళ్లు

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చేనెల 4న వెలువడనున్న తరుణంలో కాబోయే ఎమ్మెల్యే,ఎంపీకి నగరంలో ఇదే ప్రధాన సమస్య. దీనిపై కసరత్తు చేసి ప్రజలకు సురక్షితమైన తాగునీరందించాల్సి ఉంది. 2003లో ప్రధాన మంచినీటి విభాగాన్ని కాతేరు సమీపంలోకి తరలించాలనే ప్రతిపాదనలు ఉన్నా నెరవేరలేదు. అటుపై అప్పటి నుంచి తాగునీటి సమస్య అలాగే ఉంది.గత ఐదేళ్లగా తాగునీటి సమస్య పరిష్కరిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూశారు. కానీ నిరాశ ఎదురైంది. 2024లో నూతన ప్రభుత్వమైన తాగునీటి విషయంలోను తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ఉన్న సుమారు 40 లక్షల మంది ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని గోదావరి కాలుష్యాన్ని నియంత్రించాల్సి ఉంది. అంతే కాకుండా మురుగునీరు గోదావరిలో కలవకుండా చేసి సురక్షిత తాగునీరందించాలనేది ప్రజల కోరిక .దానిని ఎంత మేరకు నెరవేరుస్తారో వేచి చూడాలి.

మురుగునీరే..శుద్ధి చేసి..

రాజమహేంద్రవరం ప్రజలు వాడిన మురుగు ప్రధాన డ్రైనేజీల గుండా తుమ్మలావ, ఆర్యాపురం ఎస్ఆర్‌సీపీ మీదుగా నల్లాచానల్‌కు చేరుకుటుంది. అక్కడ నుంచి నేరుగా గోదావరిలోకి వదులుతారు.. ఈ మురుగునీరు గోదావరిలో కలిసిపోతోంది. పుష్కరాల రేవు పక్కనే నగరపాలక సంస్థ ప్రధాన మంచినీటి విభాగం ఇంటెక్ పాయింట్ ఉంది. ఆ పాయింట్ వద్ద గోదావరి నీటితో కలి సిన మురుగు నీటినే తోడేసి శుద్ధి చేస్తుంది. నగర పాలక సంస్థ ఈ నీటినే తిరిగి నగరంలో ప్రజలకు సరఫరా చేస్తున్నారు. దశాబ్దాలకు పైబడి రాజమహేంద్రవరానికి పీడిస్తున్న దీర్ఘకాలిక సమస్య ఇది. నగర ప్రజలు వాడిన మూత్రం, మలినాలతో కూడిన నీటినే ఇనేళ్ల పాటు ప్రజ లు తాగేస్తున్నారు. అలాంటిది నీరు కలిసే చోటు చూస్తే ఒల్లు గగుర్పొడుస్తుంది. నగరంలో ప్రజలు అధికంగా జబ్బుల బారిన పడడానికి పరోక్షంగా ఇదే కారణం కావొచ్చు.ఇదిలా ఉంటే గోదావరి నీరు అపవిత్రత గురించి తెలియని చాలా ప్రాంతాల వారు గోదావరి నీరు కావా లని డిమాండ్ చేయడం గమనార్హం. గత ఎన్నికల సమ యంలో సీఎం జగన్ ఇచ్చిన హామీల్లో ఇంటింటికీ గోదా వరి నీరు ఒక ప్రధాన హామీ. ఆ హామీ నెరవేర్చలేదు. రాజమహేంద్రవరంలో సమస్యకు పరిష్కారం చూపలేదు.

పౌల్ట్రీ పల్టీ





గుడ్డుకు..గడ్డుకాలం

- అయోమయంలో పౌల్ట్రీ రైతాంగం
- పెరిగిన మేత ధరలతో సతమతం
- ట్రేడర్ల ఇష్టారాజ్యం.. ధరలేక దిగాలు
- 4 రోజులుగా ప్యాకింగ్‌కు నిరాకరణ
- పేరుకుపోయిన గుడ్ల నిల్వలు
- పాలకులు స్పందించాలని డిమాండ్

పౌల్ట్రీ పరిశ్రమకు గడ్డుకాలం వచ్చిపడింది.. ఒకనాడు లాభాల బాటలో నడిచిన పరిశ్రమ నేడు నష్టాలనే చవి చూస్తోంది.. ఏ నెలకానెల సీజన్ వస్తుందని ఎదురు చూసినా కలిసిరావడంలేదు.. ఉత్పత్తి వ్యయం పెరగడం రాబడి తగ్గడం.. ఇతర రాష్ట్రాల్లో కూడా పరిశ్రమలు పెరగడంతో రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. చాలా ఏళ్లుగా పౌల్ట్రీ పరిశ్రమను తగ్గించుకుంటూ వెళుతున్నారు.. ఇదిలా ఉండగా ఇటీవల గుడ్డు రేటుపై ట్రేడర్స్ రైతుల మధ్య ఏర్పడిన వివాదం తారస్థాయికి చేరింది.. నాలుగు రోజులుగా గుడ్లు ప్యాకింగ్ కాక నిల్వలు పేరుకుపోయాయి. ఇది ఎంత వరకూ దారి తీస్తుందోనని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.



అనపర్తి, మే 20 : ఒకప్పుడు వేలాది మందికి ఉపాధి కల్పించిన కోళ్ల పరిశ్రమకు నేడు అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఉమ్మడి ఏపీలో ఎప్పటికప్పుడు మార్పులు తెస్తూ పరిశ్రమను అభివృద్ధి పదాన నడిపించిన రైతులు నేడు విభజిత ఏపీలో పరిశ్రమ మనుగడపై మీమాంసలో పడే స్థాయికి చేరుకున్నారు, ఏపీలో తయారయ్యే గుడ్డుకు జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉండేది. మన రాష్ట్రం నుంచి ఎగుమతి అయ్యే గుడ్ల కోసం ట్రేడర్లు పరుగులు పెట్టేవారు. నేటి పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా మారింది. ఇక్కడ నెక్ జోన్ ప్రకటించిన రేటుకు గుడ్లు కొనే పరిస్థితి నుంచి లోడు చేరిన తరువాత అక్కడి ట్రేడర్లు రేటు నిర్ణయించే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏడాదిలో మూడు నెలల సీజన్ కోసం రైతులు ఎదురు చూసేవారు. నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో గుడ్డు రేటు పెరగడం ఏడాదిలో మూడు నెలలతో వచ్చిన లాభంతో మిగిలిన నెలల్లో వచ్చిన ఒడిదుడుకులను రైతులు ఎదుర్కొనేవారు. ప్రస్తుతం ఏడాదంతా ఒకే పరిస్థితి నెలకొనడంతో పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.ఏపీలో పెరిగిన ఫీడ్, మందులు, ఇతర ఖర్చులకు కనీసం గుడ్డు ధర రూ రూ.6ల నుండి రూ. 7ల వరకు పలికితే తప్ప పౌల్ట్రీని నడిపే స్థితిలో రైతులు లేరనడంలో సందేహం లేదు. పేపరు ధరకు రూ.1 నుంచి రూ.2ల వరకు అదనంగా విక్రయాలు మార్కెట్‌లో జరగడంతో వినియోగదారుడు మాత్రం గుడ్డుకు రూ.6 నుంచి రూ. 7ల వరకు చెల్లించాల్సి వస్తుంది.రైతులు నష్టాలు పాలవుతున్నా వినియోగదారుడికి ఒరిగిందేమీ లేదు.

ఇతర రాష్ట్రాల్లో పెరిగిన పరిశ్రమ

గతంలో ఒరిస్సా రాష్ట్రంలో 15 లక్షలకే పరిమితమైన కోళ్ల పరిశ్రమ నేడు 1.50 కోట్ల కోళ్లతో రోజుకు సుమారుగా 1.20 లక్షల గుడ్లు ఉత్పత్తి చేసే స్థాయికి చేరుకుంది. బీహార్, బెంగాల్, ఉత్తర ప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లో కూడా కోళ్ల పరిశ్రమలు పెరగడం అక్కడ గుడ్డుకు రూ.6లు పలకడంతో అక్కడి రైతులు కోళ్ళ సంఖ్యను మరింత పెంచేందుకు ఆసక్తి చూపుతున్నారు. తమిళనాడులో కూడా కోళ్ళ పరిశ్రమ మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. అయితే అక్కడి నుంచి కేరళ, కర్నాటక రాష్ట్రాలకు గుడ్లు సరపరా జరుగుతుండడంతో పరిశ్రమ ఒడిదుడుకులు లేకుండా సాగుతుంది.

మేత ధరలతో రైతులు కుదేలు

కోళ్ళ దాణాకు వినియోగించే నూక, మొక్క జొన్న ధరలు విపరీతంగా పెరగడం రైతులకు పెనుభా రంగా మారింది.రూ.వెయ్యి నుంచి రూ.1200ల వరకు లభ్యమయ్యే వీటి ధర రూ.2500 నుంచి రూ.3 వేల వరకు పెరగడంతో ఉత్పత్తి వ్యయం పెరిగి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. టన్ను దాణా సుమారుగా రూ.30 వేల వరకు రైతులు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాణా రేట్లు తట్టుకోలేని కొందరు రైతులు తమ ఫారంలోని కోళ్ళలో సుమారు 25 నుంచి 30 శాతం వరకు మౌల్డింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు ప్రస్తుత ఎండ వేడిమితో బాటు అనేక రుగ్మతల వల్ల చనిపోతున్న కోళ్ళ సంఖ్య గణనీయంగా పెరగడంతో రైతులు విపరీతమైన నష్టాలు చవిచూస్తున్నారు. కోళ్ళ మందుల ధర కూడా పెరగడం తో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నష్టాలకు భయపడి జిల్లాలో అనేక మంది రైతులు కోళ్ళ సంఖ్యను తగ్గించుకున్నారు.

పొరుగు రాష్ట్రాల్లో రాయితీలు

కోళ్ళ పరిశ్రమను ప్రోత్సహించేందుకు అనేక రాష్ట్రాలు రాయితీలు ప్రకటిస్తుండగా.. మన రాష్ట్ర ప్రభు త్వం ఎటువంటి రాయితీలు అందించడంలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో విద్యుత్ యూనిట్‌కు రాయితీ పోను సుమారుగా రూ.4లు చెల్లించేవారు. ప్రస్తుతం యూనిట్‌కు రూ.8 నుంచి రూ.9ల వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు ఒక్క విద్యుత్ చార్జీలే నెలకు రూ.4 లక్షలు అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి. కోళ్ళ రైతులు తీసుకునే బ్యాంక్ రుణాలపై ప్రభుత్వం కొన్ని రాయితీలు అందించి వారికి వడ్డీలో ఉపశమనం కల్పించేది. కానీ 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా తొలగించడంతో పరిశ్రమపై భారం పడింది. కోళ్ళ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ఫలితం లేకపోయిందని పలువురు రైతులు వాపోయారు. 2024లో ఏర్పడే నూతన ప్రభుత్వం కోళ్ళ రైతుల కష్టాలను అర్థం చేసుకుని కొన్ని రాయితీలు అందిస్తుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు.

4 రోజులుగా గుడ్ల ప్యాకింగ్‌కు బ్రేక్

కోళ్ళ ఫారాల వద్ద గుడ్ల నిల్వలు పేరుకుపోతున్నాయి. పేపరు ధర రూ.5.10 పైసలు ఉన్నప్పటికీ రైతులకు మాత్రం ఇన్‌కమింగ్ రేటు ప్రకారం సొమ్ములు చెల్లిస్తామని అది రూ.4.70 వరకు ఉంటుందని ట్రేడర్లు చెప్పడంతో నాలుగు రోజులుగా రైతులు గుడ్లు ప్యాకింగ్‌కు నిరాకరించారు.దీంతో నిల్వలు పెరిగాయి. ఏపీ రైతు లు కేవలం కలకత్తా మార్కెట్‌పైనే ఆధారపడి ఉండ డంతో అక్కడి ట్రేడర్లు ఆడిందే ఆటగా ఉందని కొందరు రైతులు వాపోతున్నారు.కలకత్తా సమీప రాష్ట్రాల నుంచి గుడ్లు ఎక్కువ ఉత్పత్తి కావడంతో కల కత్తా ట్రేడర్లు ఏపీ గుడ్లపై ఆసక్తి చూపడంలేదని.. ఖచ్చితమైన ధర చెల్లించడం లేదని రైతులు వాపోతున్నారు.



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లతో ఎస్పీ జగదీశ్

281 సెల్‌ఫోన్‌లు రికవరీ

రాజమహేంద్రవరం, మే 19(ఆంధ్రజ్యోతి): చోరీకి గురైన/పోగొట్టుకున్న 281 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేయగా ఆయా ఫోన్‌లు ఎస్పీ జగదీశ్ యజమానులకు అందజేశారు.అనంతరం మాట్లాడుతూ ఇటీవల సెల్‌ఫోన్ల చోరీలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తుండడంతో అడిషనల్ ఎస్పీ(క్రైమ్స్) టి.సర్కార్, డీఎస్పీ (క్రైమ్స్) శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేశామన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సీఈఐ ఆర్ వెబ్ పోర్టల్ సహాయంతో ఫోన్లు రికవరీ చేశామని తెలిపారు. చోరీకి గురైన సెల్‌ఫోన్లను కేరళ, కర్నాటక, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి తీసుకు రావడం జరి గిందన్నారు. చాట్‌బోట్ వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ నాలుగు విడతల్లో రూ.2.52 కోట్ల విలువ చేసే 1393 సెల్‌ఫోన్‌లు రికవరీ చేశామన్నారు.ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలతో పాటు ఐటీ కోర్ టీం ఎస్ఐ అయ్యప్పరెడ్డి, కానిస్టేబుల్స్ ప్రియాంక, గౌతమి, శ్యామల,కిరణ్, గౌతమ్ తదితర సిబ్బందిని అభినందించారు.

జిల్లాలో విస్తృతంగా కార్డన్ సెర్చ్

రాజమహేంద్రవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ చేపడుతున్నామని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకూ ప్రతి రోజూ ఈ సోదాలు జరుగుతాయన్నారు. ఇప్పటికే నిఘా పటిష్టం చేశామన్నారు. మద్యం, బాణసంచా, ఆయుధాల అక్రమ నిల్వలపై తనిఖీలు ముమ్మరం చేశామని చెప్పారు. పెట్రోలు బంకుల్లో పెట్రోలు, డీజిల్‌ని బాటిల్స్‌లో నింపరాదన్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన రూ.10,950 విలువ చేసే బాణసంచా, నెంబరు, రికార్డు లేని 66 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం, సారా, బాణసంచా వంటి వాటిపై 100, 112కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

డిపోలకు చేరని పుస్తకాలు

ధవళేశ్వరం, మే 20 : విద్యాసంవత్సరంలో 1 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించాల్సిన పాఠ్యపుస్తకాలు పూర్తి స్థాయిలో డిపోలకు చేరలేదు.ధవళేశ్వరంలోని గవర్నమెంట్ బుక్ డిపో నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ, కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని పాఠశాలలు అందించాల్సిన పుస్తకాలను ఆయా జిల్లాల పరిధిలోని మండల విద్యా కేంద్రాలకు బుధవారం నుంచి తరలిం చాల్సి ఉంది. 1 నుంచి 7వ తరగతి వరకు 14,74,539 మొదటి సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలి. ఇప్పటికే పలు పుస్తకాలు డిపోలకు చేరగా మరిన్ని పుస్తకాలు దశల వారీగా 4 జిల్లాలకు పంపిణీ చేస్తామన్నారు.10వ తరగతి సిలబస్ మారిన దృష్ట్యా కొత్తపుస్తకాలు ముద్రణాలయాల నుంచి మండల విద్యాకేంద్రాలకు తరలించనున్నారు.





మోతుగూడెం: ఆంధ్ర, ఒడిశా సరిహద్దు గ్రామాల సమీపంలో కనువిందు చేస్తున్న మేఘాలు



ఉప్పాడ తీరంలో కనువిందు చేస్తున్న మేఘాలు

అబ్బురపరిచిన

వెండి మబ్బులు

వృద్ధురాలిపై యువకుల అత్యాచారం

గొల్లప్రోలు, మే 20: ఓ వృద్ధురాలిపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన కలకలం రేపింది. పట్టణానికి చెందిన 60 ఏళ్ల వృద్ధురాలి భర్త 30 సంవత్సరాల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి పట్టణంలో ఓ రైతుకు చెందిన మకాంలో గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో వృద్ధురాలు నిద్రిస్తున్న సమయంలో ఇద్దరు యువకులు ఆమెపై బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డారు. దీంతో షాక్‌కు గురయిన ఆమె తేరుకోలేకపోయింది. సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో కుమారుడికి ఫోన్‌లో సమాచారం అందించింది. ఇద్దరు యువకులపై అనుమానం వ్యక్తం చేస్తూ బాధితురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గొల్లప్రోలు ఎస్‌ఐ బాలాజీ కేసు నమోదు చేశారు. వృద్ధురాలిని వైద్య పరీక్షల నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

ఫెయిల్ కావడంతో మనస్తాపం

ఇటీవల పురుగుల మందు తాగిన వైనం



గొల్లప్రోలు రూరల్, మే 20: వరుసగా ఫెయిల్ అవుతుండటంతో మనస్తాపానికి గురైన ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం గోపాలపట్నం గ్రామానికి చెందిన కోనేటి రాజా నరేంద్ర(21) గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్ఈ విభాగంలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. మొదటి రెండు సంవత్సరాలు ఇంజనీరింగ్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 4వ తేదీన ఇంజనీరింగ్ కళాశాల వెనుక ఉన్న జీడిమామిడి తోటలో పురుగుల మందు తాగాడు. విషయాన్ని తన సోదరుడు, హైదరాబాదులో ఉంటున్న సత్య సాయి కుమార్‌కు ఫోన్‌లో తెలిపాడు. దీనితో అతను తన స్నేహితుడిని అక్కడకు పంపి రాజా నరేంద్రను తొలుత ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించినట్లు గొల్లప్రోలు పోలీసులకు సోమవారం సాయి సత్యకుమార్ ఫిర్యాదు చేశారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



కొత్తపల్లి, మే 20: చెట్టుపై కల్లు గీస్తుండగా దురదృష్టవశాత్తు మోకు జారడంతో గీత కార్మికుడు చెట్టుపై నుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొమరగిరి శివారు వెంకట రాయపురంలో సోమవారం ప్రతీ రోజూ మాదిరిగానే ఉదయాన్నే శీలం లక్ష్మణరావు(52) తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్నాడు. చెట్టుపై కల్లు గీస్తుండగా మోకు తాళ్లు తెగిపోవడంతో లక్ష్మణరావు ఒకేసారి కిందకు జారిపడ్డాడు. చెట్టుపై నుంచి కింద పడిన లక్ష్మణరావు అక్కడికక్కడే మృతిచెందాడు. లక్ష్మణరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అరుంధతి నక్షత్ర దర్శనం

కల్యాణోత్సవాల్లో మూడో రోజు రత్నగిరిపై వివిధ కార్యక్రమాలు



అరుంధతి నక్షత్రం చూపిస్తున్న పండితులు



గ్రామోత్సవానికి హాజరైన భక్తులు

అన్నవరం, మే 20: సత్యదేవుడి వార్షిక దివ్య కల్యాణోత్సవాలలో భాగంగా మూడో రోజైన సోమవారం నవ దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్ల అరుంధతి నక్షత్ర దర్శనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు పండితులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పురాజగోపురం వద్దకు మేళతాళాలతో తోడ్కొనివచ్చారు. ప్రత్యేకపూజలు అనంతరం దాంపత్యజీవితానికి ప్రతీకలైన వశిష్ట, అరుంధతి నక్షత్రాలను చూపించి వారికి అర్ఘ్యం అందించారు. అంతకు ముందు సాయంత్రం 5గంటలకు దర్బారు మండపంలో ప్రధాన ప్రవేశస్థాలిపాక హోమాలు జరిగాయి. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వివాహం అనంతరం అమ్మవారు మెట్టినింటికి చేరుకుని అక్కడనుంచి మరో జీవన ప్రయాణానికి నాంది పలికేందుకు ప్రతీకగా ఈ వేడుక జరిగింది. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అందజేశారు.

రావణ వాహనంపై విహారం



సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవ గ్రామోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి స్వామి,అమ్మవార్లు రావణ వాహనంపై విహరించారు. వివిధ సాంస్కృతి కార్యక్రమాల నడుమ ఈ వేడుక కోలాహలంగా జరిగింది. స్వామివారి వాహన సేవలలో రావణ వాహనసేవకు అధిక ప్రాధాన్యం ఉండడంతో అన్నవరం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రావణ వాహన సేవను తిలకించారు. తప్పెటగుళ్లు, కోలాటం, వివిధ దేవతా మూర్తుల వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

సూర్యభగవానుడికి బూరెల సమర్పణ



బూరెలు సమర్పిస్తున్న దృశ్యం

అన్నవరం, మే 20: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో అత్యంత ప్రాముఖ్యమైన దివ్యకల్యాణం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అయితే కల్యాణానికి ముందు ఆకాశమంతా మేఘావృతమై వర్షంపడి అవాంతరాలు ఏర్పడతాయేమోనని భావించారు. అయితే వరుణుడి వర్షం నుంచి విముక్తి కల్పించడంతో సూర్యభగవానుడికి సోమవారం దేవస్థానం తరుపున దేవదాయ కమిషనర్ సత్యనారాయణ దంపతులు బూరెలు సమర్పించి మొక్కు చెల్లించారు. బూరెలను తూర్పురాజగోపురం వద్ద నుంచి ఆకాశం వైపునకు విసరారు. అంతకు ముందు కమిషనర్ దంపతులు సత్యదేవుడిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల 'సరిహద్దు' మాయ

ఇసుక అక్రమ తవ్వకాలపై తప్పించుకునే యత్నం

తీపర్రు, ఉసులుమర్రులో యథేచ్ఛగా తవ్వకాలు

ఇటీవల పరిశీలించిన తూర్పు అధికారులు

ఆ సరిహద్దు కోనసీమదంటూ దాటవేత

అది తప్పంటున్న రెండు గ్రామాల ప్రజలు



తీపర్రు ర్యాంప్‌లో ఇసుక తవ్వుతున్న దృశ్యం (ఫైల్)

పెరవలి, మే 20: గోదావరి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆయా శాఖల అధికారుల్లో కదలిక వచ్చి ఆగమేఘాలపై పరుగులు తీశారు. అయితే తిమ్మిని బమ్మిని చేసి అక్రమాలు గుట్టు తేలకుండా అంతా సవ్యంగానే ఉన్నట్టు నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. తీపర్రు ఇసుక ర్యాంప్‌లో మూడు నెలలుగా జరిపిన ఇసుక అక్రమాలపై తీపర్రు, ఉసులుమర్రుకు చెందిన ప్రజానీకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ అంచనాలతో ఇష్టారాజ్యంగా వందలాది లారీలు ఇసుక తవ్వుకుని పోతుంటే ఏమి పట్టనట్టు వ్యవహరించిన అధికార యంత్రాంగం సాఫీగా వచ్చి ఏమీ జరగనట్టుగా ఉండడం విడ్డూరమని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడ అక్రమ తవ్వకాలకు తామే సాక్ష్యమని, ఏ అధికారి వచ్చినా ఏ మేరకు ఇసుక తవ్వకాలు జరిగాయో చెబుతామంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా వైపునకు తీపర్రు గ్రామం చేర్చి ఉన్నప్పటికీ ఇసుక తవ్వకాలు అన్ని కోనసీమ జిల్లా పరిధిలో జరిగినట్టు అధికారులు చెప్పడం విడ్డూరమంటున్నారు. గత 30 ఏళ్లుగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, ఇటువంటి పరిధులు ఎప్పుడూ అధికారులు నుంచి వినలేదని చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి వివిధ శాఖల అధికారులే ఇక్కడ తనిఖీలు జరిపి కేసులు నమోదు చేసేవారని, అక్రమ తవ్వకాలపై జరిమానాలు కూడా విధించేవారని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం దానికి విరుద్ధంగా కొత్త జిల్లాలు ఏర్పడిన అనంతరం ఈ ప్రాంతం తూర్పుగోదావరిలోకి, గోదావరి అవతలి ప్రాంతం కోనసీమ జిల్లాలోకి మారాయి. దీంతో అవతలి వైపు భాగాన్ని కోనసీమ జిల్లా అధికారులు పరిశీలించాలని ఇక్కడి అధికారులు చేతులు దులుపుకోవడం సబబు కాదని పేర్కొంటున్నారు. అయితే కోనసీమ జిల్లా అధికారులైనా స్పందించి ఈ ప్రాంతానికి వచ్చి విచారిస్తే తాము సాక్ష్యాధారాలతో అక్రమ తవ్వకాల బాగోతం బయట పెడతామని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు. ప్రతిమ కంపెనీకి 2025 సంవత్సరం వరకు అనుమతులు ఉన్నాయని చెబుతున్న అధికారులు అసలు ఆ కంపెనీకి ఏ జిల్లా అధికారులు అనుమతులు ఇచ్చారో, దానికి నిర్ణయించిన పరిధులు ఏమిటో, ఎన్ని క్యూబిక్ మీటర్లు ఉంటాయో తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా అధికారుల అనుమతి పొంది కోనసీమ జిల్లా పరిధిలో ఇసుక తవ్వకాలు జరిపితే అవి అక్రమ తవ్వకాలే కాబట్టి వెంటనే కోనసీమ జిల్లా అధికారులు స్పందించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాలు తమతో పాటు తూర్పుగోదావరి జిల్లా మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు కూడా సాక్ష్యం చెబుతారని, అక్రమంగా తవ్విన ఇసుక గుట్టలు కూడా నిడదవోలు-నరసాపురం రహదారి పక్కన ఉన్నాయని పేర్కొంటున్నారు. కోనసీమ జిల్లా అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని, ఆ గుట్టలు కూడా తరలిపోతే ఇసుక అక్రమ తవ్వకాల సాక్ష్యం లేకుండా పోతుందని పేర్కొంటున్నారు.

నయా మామిడి!

మార్కెట్లోకి కొత్త రకాలు



బనానా మేంగో



మియాజాకీ మామిడి



థాయిలాండ్ వైట్ మేంగో

కడియం, మే 20: కడియం నర్సరీ రైతులు విభిన్న మామిడి పండ్ల రకాలను పండిస్తున్నారు. బనానా, థాయిలాండ్ వైట్, మియాజాకీ తదితర రకాల మామిడి మొక్కలను తీసుకువచ్చి ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం కడియం నర్సరీల్లో ఈ సరికొత్త మొక్కలను పెంచుతున్నారు. కొత్తరకం మొక్కలను ప్రస్తుతం తోటలుగా వేసేందుకు, అలానే మార్కెటింగ్, నేల స్వభావం వంటి పరిస్థితులను ఆలోచించి రైతులు వీటిని పెంచడానికి ఉత్సాహం చూపుతున్నారు.

పండూరి మామిడి

చూడడానికి ఈ మామిడి పండ్లు పిందెల్లాగా కనిపిస్తాయి. ఆకుపచ్చని మామిడిపండ్లపై చిన్నచిన్న చుక్కలు ఉంటాయి. తింటే గాని వీటి మధురం తెలియదు. మిగలముగ్గిన పండు తొక్క కూడా ఆకుపచ్చగానే ఉంటుంది. ధరలోనూ ప్రియమే.

ఆల్ఫాన్సా మామిడి

హైబ్రిడైజేషన్‌తో పుట్టుకొచ్చిన సరికొత్త మామిడి ఆల్ఫాన్సా. రైతులను ఆర్థికంగా నిలదొక్కేందుకు కూడా ఎంతో ఉపకరిస్తాయి. గాలి వానల సమయంలో రాలకుండా ఉండడం వీటి ప్రత్యేకత. తేనెలొలికే తియ్యదనం మరో ప్రత్యేకత. వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ.

బరామాస మామిడి

బరామాస ఏడాది పొడవునా కాస్తూ వేసవిలో అధికంగా కాయలు ఇస్తుంది. ఈ రకం మామిడి పండ్లు నిగనిగలాడుతూ పలకరించినట్లు ఉంటాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉండడం వీటి ప్రత్యేకత. పీచు పదార్థం ఎక్కువగా ఉండడంతో పాటు టెంకభాగం వరకు గుజ్జు ఉంటుంది.

కొత్తరకాల మొక్కలు

బనానా మామిడి

ఇతర దేశాల నుంచి తీసుకువచ్చి పెంచుతున్న ఈ మామిడి అరటిపండులా సన్నగా, పొడవుగా ఉంటుంది. టెంక సన్నంగా ఉంటుంది. ఈ మామిడి తింటుంటే జ్యూస్ తాగినంత మధురానుభూతి కలుగుతుందని నర్సరీ రైతు జానకీరామ్(నాని) తెలిపారు.

థాయిలాండ్ వైట్‌మామిడి

ఈ చెట్టు వేసిన 3, 4 ఏళ్లకే కాపు కొస్తాయని నర్సరీ రైతు చెబుతున్నారు. ఈ ఫలాన్ని ముక్కలుగా కోసుకుని ఆరగిస్తుంటారు.

ఘనంగా భావనారాయణస్వామి గ్రామోత్సవం



సర్పవరం జంక్షన్, మే 20: కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో శ్రీ రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి దివ్య వార్షిక కల్యాణోత్సవాలు గత నాలుగు రోజులుగా భక్తుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. దేవదాయ,ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అత్యంత వైభవంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాలను స్వయంగా తిలకించలేని భక్తుల కోసం సోమవారం రాత్రి నూతన వస్త్రాలు, విశేష పుష్పాలంకరణతో ఉన్న కల్యాణ దంపతులు శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి వారిని సింహవాహనంపై కొలువుదీర్చి మాడ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ స్వామివారి కల్యాణాన్ని స్వయంగా వీక్షించలేని భక్తులు, వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్య రుగ్మతలతో ఇంటి వద్దే ఉండిపోయిన వారి క్షేమాన్ని ఆకాంక్షిస్తూ స్వామివారిని గ్రామోత్సవం చేసినట్లు తెలిపారు.

లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన భక్తులు

అన్నవరం, మే 20: సత్యదేవుడి దర్శనానికి విచ్చేసిన ఒక భక్తబృందం సోమవారం రైల్వేస్టేషన్‌లో ఉన్న లిఫ్ట్‌లో సాంకేతికలోపం కారణంగా సుమారు గంటపాటు ఇరుక్కుపోయి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విజయవాడకు చెందిన 10 మంది బృందం ఆదివారం సత్యదేవుడి దివ్యకల్యాణం వీక్షించేందుకు విచ్చేసి తిరుగు ప్రయాణంలో ఉదయం 12.45కు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. మూడో నంబరు ప్లాట్‌ఫాం నుంచి ఒకటో నెంబరుకు వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కగా మధ్యలో నిలిచిపోయింది. సుమారు గంటసేపు దానిలో ఉండిపోయారు. అయితే సాంకేతిక సిబ్బంది అన్నవరంలో లేకపోవడంతో ఉన్నతాధికారులకు అన్నవరం స్టేషన్ సిబ్బంది సమాచారం ఇచ్చారు. వారి రాక ఆలస్యమవడంతో లిఫ్ట్ పైభాగం విప్పి సరిచేశారు. ఈ భక్త బృందం రత్నాచల్‌లో విజయవాడ చేరుకున్నారు. నరకం అనుభవించామని ఇంత పెద్ద పుణ్యక్షేత్రం కలిగిన రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ సాంకేతిక బృందం లేకపోవడం బాధాకరమని ప్రయాణికులు వాపోయారు.

వాటర్ యాపిల్స్

పోషకాలు మెండు



కడియం, మే 20: పుల్లపుల్లగా, తియ్యతీయగా ఉండే వాటర్ యాపిల్స్‌ను జంబోఫలం, గులాబీ జామ్ అంటారు. వేసవి తీవ్రతకు కలిగే దాహార్తి నుంచి ఉపశమనం కలిగేందుకు చల్లని నీరు, మజ్జిగ, కొబ్బరిబొండాం, లస్సీలు, జ్యూస్‌లు వంటి వాటిని తాగుతుంటాం. అలానే వీటితో పాటు మినరల్స్, సీ-విటమిన్ పుష్కలంగా ఉండే వాటర్ యాపిల్స్ కూడా మనకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. కడియం నర్సరీలో వాటర్ యాపిల్స్ ఎరుపు, గ్రీన్, మల్టీకలర్ వంటి రంగుల్లో మనకు లభిస్తున్నాయి. వేసవిలో గుత్తులు, గుత్తులుగా కాసే ఈ వాటర్ యాపిల్స్‌లో మంచి పోషకాలు ఉండటంతో పాటు దాహార్తి నుంచి మనకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. వాహనాల్లో ప్రయాణించే సమయంలోను, ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలోను వీటిని వెంట తీసుకెళితే దాహార్తిని తీర్చే ఔషధంగా ఎంతో మేలు చేస్తాయని నర్సరీ రైతులు అంటున్నారు. ఈ చెట్టు పెరిగే కొద్దీ ఫలాలతో పాటు మంచినీడ కూడా ఇస్తుంది. వాటర్ యాపిల్స్ మొక్కలను వాణిజ్య పంటగా కూడా వేసుకుంటే మంచి లాభాలు ఉంటాయని. నల్లరేగడి భూములతో పాటు, ఎర్రనేలల్లో కూడా ఈ మొక్కలు బాగా పెరుగుతూ మంచి ఫలాలను ఇస్తాయని నర్సరీ రైతులు చెబుతున్నారు.

మట్టి తరలింపు వాహనాలు సీజ్



వాహనాలను సీజ్ చేసిన అధికారులు



కరప, మే 20: కరప మండలం యండమూరులోని చేలల్లో మట్టిని తరలిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సంయుక్త దాడులు నిర్వహించారు. పెద్దాపురప్పాడు గ్రామానికి చెందిన ఏడు ట్రాక్టర్లను సీజ్ చేసి కరప పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక్కో మట్టి ట్రాక్టర్‌కు రూ.3 వేలు చొప్పున పెనాల్టీ విధించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ అనుమతులు లేకుండా మళ్లల్లో మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్టి ట్రాక్టర్ రోడ్డెక్కితే వెంటనే వాటిని సీజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. పొలాల్లో మెరకలు తీసుకోవాలంటే సంబంధిత రైతు ముందుగా తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానిక వీఆర్వోతో విచారణ చేయించి మళ్లల్లో మట్టిని మళ్లల్లోనే సర్దుబాటు చేసుకునేలా అనుమతినిస్తామన్నారు. కాగా పెదకొత్తూరు, కరప, కొరుపల్లి, గొడ్డటిపాలెం, అరట్లకట్ట, కూరాడ, పెనుగుదురు తదితర గ్రామాల్లో మళ్లల్లోని మట్టిని ఇటుక బట్టీల్లోకి, దిమ్మలకు యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. అయితే అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్ తొట్టి నుంచి మట్టి అండలు రోడ్డుపై పడి చినుకులకు తడిచి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి వచ్చిందంటే గ్రామాల్లో మట్టి మాఫియా చేస్తున్న ఆగడాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏపీఈఏపీ సెట్‌కు రెండు సెషన్లలో 2176 మంది హాజరు

జేఎన్టీయూకే, మే 20: కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి సోమవారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 1,112 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1079 మంది హాజరయ్యారని, 33 మంది గైర్హాజరు కాగా 97.03 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 1,116 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1097 మంది హాజరయ్యారని, 19 మంది గైర్హాజరు కాగా 98.30 శాతం హాజరు నమోదైందన్నారు. మొత్తం రెండు సెషన్‌లలో 2,228 మంది హాజరుకావాల్సి ఉండగా 2,176 మంది హాజరయ్యారని 52 మంది పరీక్ష రాయలేదని 97.67 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం రాజమహేంద్రవరం ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఆన్‌లైన్‌లో రెండు సెషన్‌లలో నిర్వహించిన పరీక్షకు 1377 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1341 మంది హాజరయ్యారని, 36 మంది పరీక్ష రాయలేదని మొత్తం 97.39 శాతం హాజరు నమోదైందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని భట్లపాలెంలో గల బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో రెండు సెషన్లలో నిర్వహించిన ఇంజనీరింగ్ విభాగ పరీక్షకు 690 మంది హాజరు కావాల్సి ఉండగా 680 మంది హాజరయ్యారని 10 మంది గైర్హాజరు కాగా మొత్తం 98.55 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ప్రవేశ పరీక్షలు ఈనెల 23 వరకూ కొనసాగుతాయన్నారు.

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

ఇసుక రీచ్‌లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ విజయసునీత



ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయసునీత

ఎటపాక, మే 20: ఎటపాక మండలంలోని పలు ఇసుక రీచ్‌లను సోమవారం జిల్లా కలెక్టర్ విజయ సునీత పరిశీలించారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలంటూ మార్గదర్శకాలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఇసుక రీచ్‌లను పరిశీలించారు. మండలంలో గొమ్ముకొత్తగూడెం, రాయనపేట, గుండాల, కన్నాయిగూడెం ఇసుక రీచ్‌లను పరిశీలించి, అధికారులకు సూచనలు జారీ చేశారు. రాయనపేట, కన్నాయిగూడెం ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు అనుకూలంగా లేవని, గుండాల, గొమ్ముకొత్తగూడెం ఇసుక రీచ్‌లు అనుకూలంగా ఉన్నట్లు చెప్పారు. ఈ ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట పీవో కావూరి చైతన్య ఓఎస్డీ మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ సమయాల్లో గీత దాటితే కఠిన చర్యలు



అఖిలపక్ష నాయకులతో సమావేశమైన ఎస్ఐ

కూనవరం, మే 20: వచ్చే నెల నాలుగో తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజు ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కూనవరం ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని అఖిలపక్షం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఫలితాలు వచ్చాక ఎటువంటి సంబరాలు చేసుకోవడం, బాణాసంచా కాల్చడం నిషేధమన్నారు. లూజ్ పెట్రోల్‌ను అమ్మరాదన్నారు. అఖిలపక్షం నాయకులు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పొడియం అప్పారావు, వైసీపీ నాయకుడు మరియదాస్, మేజర్ పంచాయతీ సర్పంచ్ హేమంత్, రసూల్, చెలకాని ఉమా తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల మండలంలో భారీ వర్షం



కూలిన చెట్లు



కురుస్తున్న వర్షం

అడ్డతీగల, మే20: అడ్డతీగల మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండ, వడగాడ్పులకు అల్లాడిపోయిన ప్రజలను ఈ భారీ వర్షం సేద తీర్చింది. ఈదురు గాలులకు కొన్ని చెట్లు నేలకొరిగాయి. ఈదురుగాలుల దృష్ట్యా విద్యుత్ పంపిణీకి ఆటంకం ఏర్పడింది. గోకవరం నుంచి వచ్చే వాహనాలకు కాస్త ఇబ్బంది పడడంతో పరిసర గ్రామస్థులు నేలకొరిగిన చెట్ల కొమ్మలను తొలగించారు. ఈదురు గాలులు కారణంగా అడ్డతీగల, గంగవరం మధ్య విద్యుత్ పంపిణీకి అంతరాయం ఏర్పడింది.

ఎన్నికల కోడ్.. జూన్ 6 వరకు అమలు : సీఐ



సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ జగదీశ్వరరావు

కొవ్వూరు, మే 20: జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, నియోజకవర్గంలో ఎటువంటి ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని సీఐ జగదీశ్వరరావు తెలిపారు. డీఎస్పీ కేసీహెచ్ రామారావు ఆధ్వ ర్యంలో కొవ్వూరు పట్టణ, మండల సీఐలు జగదీశ్వరరావు, పి.శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి సోమవారం మండలంలోని వాడపల్లి బంగారమ్మపేటలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. పోలీసు సిబ్బంది ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. సరైన రికార్డులు లేని ఆరు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ జగదీశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్డెన్ అండ్ సెర్చ్‌లో భాగంగా బంగారమ్మపేటలో తనిఖీలు నిర్వహించామన్నారు. ఎన్నికల కౌంటింగ్‌కు ముందుగాని, తరువాత గాని అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్‌తో పాటు 30 పోలీసు యాక్టు, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. తనిఖీల్లో పట్టణ, రూరల్ ఎస్ఐలు జుబేర్ మహ్మద్, కె.సుధాకర్, చాగల్లు ఎస్ఐ, మూడు స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

నిడదవోలు, మే 20: నిడదవోలులోని కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పొడుగు శ్రీరామమూర్తి, అధ్యక్షుడిగా గోలి రామబ్రహ్మం, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌వీవీ సత్యనారాయణ, కోశాధికారిగా లావేటి జేజీ శివన్నారాయణ, ఉపాధ్యక్షుడిగా కొమ్మోజు చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా పొడుగు నరేష్, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్టు సంక్షేమం సంఘం ఓ ప్రకటనలో తెలిపింది.

నిడదవోలులో భారీ వర్షం



నిడదవోలు, మే 20: నిడదవోలులో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురి సింది. దీంతో పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ జలమయమ య్యాయి. డ్రైన్లు పొంగి పొర్లాయి. రోడ్లు జలమయం కావడంతో వాహనదార్లు ఇబ్బందులు పడ్డారు.

ఇంకెన్ని ప్రాణాలు పోవాలి!

- నత్తనడకన సీతానగరం -రాజమహేంద్రవరం రోడ్డు పనులు
- అసంపూర్తిగా నిలిచిన కల్వర్టుల నిర్మాణాలు
- ఇప్పటి వరకు ఆరు ప్రమాదాలు.. ముగ్గురి మృతి



పడి..పోతున్నారు : డివైడర్ కోసం వదిలేసిన గాడి

సీతానగరం, మే 20: వంద కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్న సీతానగరం -రాజమహేంద్రవరం 4 లైన్ల రోడ్డులో జరుగుతున్న ప్రమాదాలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులు నత్తనడక సాగుతున్నాయి. ఇప్పటికే ఈ రోడ్డులో ఆరు ప్రమాదాలు జరిగి ముగ్గురు మృతి చెందారు. మండలంలోని రాపాక తూరలు వద్ద, రఘుదేవపురం వద్ద రెండు కల్వర్టులు ఈ రోడ్డులోనే నిర్మిస్తున్నారు. ఈ రెండూ అసంపూర్తిగా ఉండడంతో ఏ విధమైన హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఈ ప్రాంతానికి కొత్తగా వచ్చే వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా కాంట్రాక్టర్లు గాని, అధికారులు గాని పట్టించుకోవడం లేదు. 4 లైన్ల రోడ్డు కావడంతో రోడ్డు మధ్యలో వేసే డివైడర్ కొన్నిచోట్ల వేయకపోవడంతో మధ్యలో ఉన్న గాడి ప్రమాదాలకు కారణమవుతోంది. ఏ మాత్రం ఆదమర్చినా ప్రమాదం జరుగుతోంది. దీంతో ఈ రోడ్డు పనులు పూర్తయ్యే సరికి ఇంకా ఎన్ని ప్రాణాలు పోవాలంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రాపాక తూరల వద్ద హెచ్చరిక బోర్డులు లేకుండా కల్వర్టు పనులు



రఘుదేవపురం వద్ద కల్వర్టు పనులు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజానగరం(కోరుకొండ), మే 20: నరసాపురం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా నరసాపురంలో ఈ నెల 22న ఉదయం 7నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ శ్రీధర్ వర్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

శ్రీశైలం సాక్షి గణపతిని దర్శించుకున్న నల్లమిల్లి



సాక్షి గణపతి ఆలయ ప్రాంగణంలో నల్లమిల్లి కుటుంబం

అనపర్తి, మే 20: అనపర్తి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం శ్రీశైలంలోని ప్రసిద్ధ సాక్షి గణపతిని దర్శించుకున్నారు. రామకృష్ణారెడ్డి.. సతీమణి మహాలక్ష్మి, మాతృమూర్తి సత్యవతిలతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామిని దర్శించుకున్నారు. వీరి వెంట టీడీపీ నాయకులు నల్లమిల్లి సుబ్బారెడ్డి, గొలుగూరి భాస్కరరెడ్డి తదితరులున్నారు.

గైట్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

రాజానగరం, మే 20: క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తమ కళాశాలకు చెందిన 79 మంది విదార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ లూకాస్ టీవీఎస్ సంస్థ గైట్ కళాశాలలో సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించిందన్నారు. ఈఈఈ, మెకానికల్, ఆటో మొబైల్ ఇంజనీరింగ్ విభాగాలతో బీటెక్, పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులు పాల్గొన్నారని, ఎంపికైన వారంతా త్వరలోనే ఉద్యోగాల్లో ప్రవేశిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎన్.లీలావతి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పీజీ రామానుజమ్ తదితరులు అభినందించారు.

ఉపాధి కూలీకి పాముకాటు.. వైద్యం

కడియం, మే 20: పాముకాటుకు గురైన ఉపాధి కూలీకి సీహెచ్‌సీతో వైద్యం చేశారు. కడియంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా కాలువ పనులు చేస్తుండగా నీలగిరి సత్యనారాయణ అనే కూలీ పాముకాటుకు గురయ్యాడు. విషయం తెలియగానే ఎంపీడీవో రాజ్‌మనోజ్ స్థానిక సీహెచ్‌సీకి వెళ్లి డాక్టర్ శివశంకర్‌తో మాట్లాడి వైద్యసేవలు అందించారు. సత్యనారాయణ ఆరోగ్యపరంగా కోలుకునే వరకు ఎన్ఆర్ఈజీఎస్ నిబంధనల మేరకు మస్తరు వేస్తామని ఈ సందర్భంగా ఎంపీడీవో తెలిపారు.

జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుక

రాజానగరం, మే 20: సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ 41వ పుట్టిన రోజు వేడుకలను మండల నందమూరి యువసేన ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యారావుపేట, రూపానగర్ గ్రామాల్లో భారీ కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకుంటూ, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నందమూరి యువసేన మండలాధ్యక్షుడు పాతూరి నవీన్‌చౌదరి, మార్గాని రామకృష్ణ ప్రసాద్ యాదవ్, నాగు, డాన్ శ్రీను, పండు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడి ఇంట్లో భారీ చోరీ

30 కాసుల బంగారం, వెండి వస్తువుల అపహరణ



పొలమూరులో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ శివగణేష్

అనపర్తి, మే 20: మండలం పొలమూరులో ఇంటికి తాళాలు వేసుకుని తీర్థయాత్రలకు వెళ్లిన అర్చక కుటుంబం ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండి వస్తువులను దోచుకుపోయారు. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుండు వెంకటరమణయ్య స్థానిక ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 14న ఇంటికి తాళాలు వేసుకుని కుటుంబంతో సహా తీర్థయాత్రలకు వెళ్లాడు. ఈ నెల 19న పనిమనిషి అప్పయ్యమ్మ ఆయనకు ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని చెప్పడంతో రమణయ్య తీర్థ యాత్రలు మధ్యలోనే ముగించుకుని సోమవారం ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు, బీరువా తెరచి ఉండడం సామాన్లు చెల్లా చెదురుగా ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్ఐ రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. బీరువాలోని 30కాసులు బంగారు ఆభరణాలు, కొన్ని వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ శివగణేష్ ఎస్ఐకు పలు సూచనలు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రెండు గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం



రాజమహేంద్రవరం, మే 19(ఆంధ్రజ్యోతి): రెండు గుర్తు తెలియని మృతదేహాలు లభ్యమయ్యాయని ప్రభుత్వ రైల్వే పోలీస్(జీఆర్పీ) సీఐ విజయ్ శంకర్ తెలిపారు. గూడ్స్ షెడ్ సమీపంలో సుమారు 40ఏళ్ల కలిగిన వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. చికిత్స పొందుతూ మరణించాడన్నారు. ద్వారపూడి-కడియం రైల్వే స్టేషన్ల మధ్యలో ట్రాక్‌పై పడి ఉన్న మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించామన్నారు. వివరాలు తెలిసిన వారు ఫోన్ నెంబర్ 94406 27551, 94914 44022కి సమాచారం అందించాలని సీఐ కోరారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

రంగంపేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ హేమ



రంగంపేట, మే 20: రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024 -25 విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ బి.హేమ సోమవారం తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు తెలుగు, ఇంగ్లీషు మీడియంలో అందుబాటులో ఉన్నాయని, ఒక్కొక్క గ్రూపు నుంచి 100కు పైగా సీట్లు ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు లభిస్తాయన్నారు. తమ కళాశాలలో విశాలమైన తరగతి గదులు, గ్రంథాలయం, ప్రయోగశాలలు, మినరల్‌వాటర్, ఆధునాతన టాయ్‌లెట్లు, విశాలమైన ఆటస్థలం వంటి సౌకర్యాలు ఉన్నాయన్నారు. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా అనుభవజ్ఞులైన అధ్యాపకులతో మెరుగైన విద్యాబోధన అందిస్తామని ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



కడియం గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కడియం, మే 20: కడియం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరం సోమవారం ఆరో రోజుకు చేరింది. గ్రంథాలయాధికారిణి శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పుస్తకపఠనం చేయించారు. సచివాలయ, 108 సిబ్బంది.. విద్యార్థులకు కథ వినడం, పుస్తక సమీక్ష, సోషల్ వివరణ గురించి తెలిపారు.

సురక్షితంగా కోర్టులో హాజరుపర్చాలి

దివాన్‌చెరువు, మే 20: అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లేందుకు ప్రయాణంలో ఉన్న తమ పార్టీ అజ్ఞాతదళ నాయకులు రాజన్న, జీవన్, దేవ్‌రెడ్డిలతో బాటు మరొకరిని గతరాత్రి పోలీసులు వరంగల్ జిల్లా సరిహద్దులో అక్రమంగా అరెస్ట్ చేశారని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సంయుక్త కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అరెస్ట్ చేసిన వారికి ఎటువంటి ప్రాణహాని తలపెట్టకుండా వెంటనే కోర్టులో హాజరుపర్చాలని తెలంగాణా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఏజెన్సీ ప్రాంతంలో కొనసాగుతున్న కూంబింగ్‌ను తక్షణమే నిలిపి వేయాలని కూడా డిమాండ్ చేస్తున్నామన్నారు.

వీరభద్రస్వామి తీర్థ మహోత్సవాలు



రంగంపేటలో వీరభద్రస్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రంగంపేట, మే 20: రంగంపేటలోని శ్రీసాయినగర్‌లో వీరభద్రస్వామి వార్షిక తీర్థ మహోత్సవాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయార్చకులు.. భక్తులు వట్టికూటి రాజేంద్రప్రసాద్, శ్రీలక్ష్మీలతో స్వామివారి ప్రతిరూపమైన విభూతి పండుకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వామి వారి చిత్రపటాన్ని డప్పువాయిద్యాలు, బాణసంచాకాల్పులతో ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. ఈ నెల 27న ప్రత్యేక పూజలు, అన్నసమారాధన చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ రాత్రి భజన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బొట్టు స్వామి,యానాపు త్రిమూర్తులు, కేతా సత్యనారాయణ, కొండి జమీ, చెక్కపల్లి శివ, సియాకుల దుర్గాప్రసాద్, బాబూరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతానగరం, మే 20: మిర్తిపాడు రూరల్ ఫీడర్ 11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ శ్రీధర్ వర్మ తెలిపారు. బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు.

పెరటి తోటలతో ఇంటి వద్దనే కూరల సాగు

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ రమణమూర్తి



దొమ్మేరులో స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కొవ్వూరు, మే 20: పెరటి తోటల పెంపకం ద్వారా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు ఇంటి వద్దనే పండించుకోవచ్చునని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ కేవీ రమణమూర్తి అన్నారు. సోమవారం కొవ్వూరు మండలం దొమ్మేరులో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాలల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పెరటి తోటల పెంపకంపై రైతులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. రమణమూర్తి మాట్లాడుతూ పెరటి తోటలు పెంపకంతో కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు కేఎం దక్షిణామూర్తి, సీహెచ్ సునీత, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

హైకోర్టు బార్ లైబ్రరీ సెక్రటరీగా కోదాటి



రాజమహేంద్రవరం సిటీ, మే 20: రాజమహేంద్రవరానికి చెందిన న్యాయవాది కోదాటి రమ్యకృష్ణ ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీగా ఎన్నికయ్యారు. హైకోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో రమ్యకృష్ణ 787 ఓట్లతో గెలుపొందారు. గత నెల 30న అమరావతిలో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో లైబ్రరీ సెక్రటరీగా ఎన్నికైన మొదటి మహిళా న్యాయవాదిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

కోటిలింగాల ఆలయ సమీపంలో ఈట్‌స్ట్రీట్ వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, మే 20: కోటిలింగాల దేవస్థానం సమీపంలో గోదావరి గట్టుపై ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేయవద్దని రాజమహేంద్రి వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ కన్వీనర్ టీకే విశ్వేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి గట్టువెంబడి మాంసాహార వంటకాలను ఎట్టిపరిస్థితుల్లో విక్రయించడానికి వీల్లేదన్నారు. దీనిని పట్టించుకోకపోతే ఆందోళన చేపడతామన్నారు.ఈ సమావేశంలో కెకె సంజీవరావు, మాదిరాజు శ్రీనివాస్, దేశిరెడ్డి బలరామనాయుడు, కమిటీ కన్వీనర్ కృష్ణకుమార్, సభ్యులు పట్నాయక్, ఎల్వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులతో మర్యాదగా నడుచుకోవాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు



వృద్ధుడికి గుర్తింపు కార్డు అందజేస్తున్న ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, మే 19(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలని, వృద్ధుల పట్ల గౌరవంగా నడుకోవాలని.. లేదంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. అవసరాలను తీర్చకపోయినా, అమర్యాదగా చూసినా చట్టాన్ని ఆశ్రయించే హక్కు వారికి ఉందని తెలిపారు. వయోవృద్ధుల హక్కుల పరిరక్షణపై డీఎల్ఎస్ఏలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. నల్సా వయోవృద్ధుల న్యాయ సేవల పథకం-2016పై అవగాహన కల్పించారు. వివిధ రకాల దస్తావేజులు, రద్దు ప్రక్రియలు, రివర్స్ మార్ట్‌గేజ్ తదితర అంశాలను వివరించారు.35 మంది వయోవృద్ధులకు గుర్తింపు కార్డులు అందజేశారు.

అక్టోబరు, డిసెంబరులో చెస్ పోటీలు



విలేకరులతో మాట్లాడుతున్న అసోసియేషన్ కార్యదర్శి భీమారావు

రాజమహేంద్రవరం అర్బన్, మే 20: అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో భాగంగా భారతీయ నవీన క్రీడా ఉత్సవ్ (బీఎన్‌కేయూ) ట్రస్టు ద్వారా ఈ ఏడాది అక్టోబరు 19 నుంచి 25 వరకూ, డిసెంబరు 24 నుంచి 26వ తేదీ వరకూ రెండు అంతర్జాతీయ చెస్ పోటీలు నిర్వహించనున్నామని ట్రస్టు కార్యదర్శి విత్తనాల కుమార్ వెల్లడించారు. రాజమహేంద్రవరంలోని కాలఫ్యూషన్ చెస్ అకాడమీలో సోమవారం మాట్లాడారు. ట్రస్టు ద్వారా రాష్ట్రంలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించి పేద క్రీడాకారులకు ఆర్థికంగా చేయూత ఇస్తున్నామన్నారు. సమావేశంలో ట్రస్టు కోశాధికారి టి.నరేష్‌కుమార్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.భీమారావు, ట్రస్టు ఉపాధ్యక్షుడు ఏ.ఉదయ్‌కుమార్ నాయుడు, చెస్ ఆర్గనైజర్లు లీలాకుమార్, మనోహర్ పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి: పీడీఎస్‌యూ

రాజమహేంద్రవరం అర్బన్, మే 20: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. ఈ మేరకు పీడీఎస్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను తొలగించాలని కోరారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులకు ఒక వినతిపత్రం అందజేసినట్టు పేర్కొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	ఆ ఒక్కటీ అడక్కు
సూర్యామినీ	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
సూర్యాప్యాలస్	అపరిచితుడు
స్వామి	కృష్ణమ్మ
శివజ్యోతి	గీతాంజలి మళ్లీ వచ్చింది
అనుశ్రీ(సాయికృష్ణ)	ది గ్యారీ ఫీల్డ్ మూవీ
రాజా	రత్నం
ఊర్వశి	బాక్
రంభ	మిరల్
మేనక	నటరత్నాలు, ప్రసన్నవదనం
అప్సర	కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
కుమారి	దర్శిని, రత్నం
వీఎస్ మహల్(నామవరం)	కృష్ణమ్మ
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	అపరిచితుడు
వెంకటసూర్య(కడియం)	ఆ ఒక్కటీ అడక్కు
సత్యగౌరి (అనపర్తి)	బాక్
సూర్యశ్రీ (అనపర్తి)	ఆ ఒక్కటీ అడక్కు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	బాక్
రామకృష్ణ(కోరుకొండ)	
గీతాసినిమాస్ (సీతానగరం)	
శ్రీనివాస (గోకవరం)	కృష్ణమ్మ
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
లలితామహల్(రంపచోడవరం)	ఆ ఒక్కటీ అడక్కు
నవయుగ(చింతూరు)	ఆ ఒక్కటీ అడక్కు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

మంగళవారం 21 మే 2024 3





ఇసుక అక్రమాలే లేవట?

సుప్రీంకోర్టుకు జిల్లా అధికారుల నివేదిక

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఇసుక అక్రమాలు లేవు. ప్రస్తుతం 16 ఓపెన్ రీచ్‌లలో తవ్వకాలు జరగడంలేదని జిల్లా అధికారులు సుప్రీంకోర్టుకు నివేదిక సిద్ధం చేశారు. ఈ నివేదికను మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ ద్వారా సుప్రీంకోర్టుకు పంపించనున్నారు. ఆదివారం ఉరుకులు, పరుగులతో వర్షంలో తడుస్తూ అధికారులు ర్యాంపులను పరిశీలించిన సంగతి తెలిసిందే. అక్కడ ప్రస్తుతం ఇసుక తవ్వకాలు ఆగిపోయినప్పటికీ..అప్పటివరకూ జరిగిన తవ్వకాల ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వాటిని అధికారులు పట్టించుకోలేదు. పెద్దపెద్ద గుట్టలుగా అక్రమ తవ్వకాల ఇసుక స్టాక్ పాయింట్లు కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నా వాటిని పట్టించుకోలేదు. ర్యాంపుల సమీపంలో ఈ గుట్టలు ఉన్నా ఏ మాత్రం అక్రమాలు జరగలేదని అధికారులు నివేదిక సిద్ధం చేయడం గమనార్హం. ఇసుక దోపిడీపై అధికారులు విచారణ చేసి ఇంత వరకూ ఏమి జరిగిందో కూడా నివేదికలో ఇవ్వాలి. కానీ అక్కడ ఏమీ జరగడం లేదని మాత్రమే ఇవ్వడం గమనార్హం. అంటే అధికార వైసీపీ ఒత్తిడికి అధికారులు ఎంతగా భయపడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

తూచ్..తూగోజిది కాదు.. 6



నన్నయలో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్

కౌంటింగ్ ప్రక్రియ అంతా వీడియో తీస్తాం

- 4న 5 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం
- కౌంటింగ్ కేంద్రం వద్దకు సెల్ అనుమతించం
- రౌండ్స్ వారీగా సమాచారం అందజేత
- వాహనాలకు అనుమతి ఉండదు
- ఆర్వోలతో సమీక్షలో కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ, మే 20 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పట్ల అత్యంత జాగ్రత్త వహించాలని అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కే.మాధవీలత సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై సోమవారం ఆర్వోలకు శిక్షణ ఇచ్చారు. నన్నయ వర్శిటీలో ఓట్ల లెక్కింపు జరిగే సమయంలో కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్‌లు అనుమతించరాదన్నారు. ఆర్వో సెల్‌ఫోన్‌కు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. వాటి ద్వారానే రౌండ్స్ వారీగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మీడియా సెంటర్ వరకు మొబైల్ ఫోన్‌లు అనుమతించవచ్చని తెలిపారు. సీసీ టీవీ కెమెరాల నిఘా లో కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు.రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు వివరాలు ఎన్కోర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఐదు వీవీ ప్యాట్స్ ఓటర్ స్లిప్స్ ర్యాండమ్‌గా ఎంపిక చేసి లెక్కింపు జరపాలన్నారు. నన్నయ వర్శిటీలోకి ఎటువంటి వాహనాలు అనుమతించరాదన్నారు. వర్శిటీ ప్రధా న ద్వారం వద్ద ఏర్పాటు చేసిన నాలుగు ఏసీ బస్సుల ద్వారా సిబ్బంది లోపలికి చేరుకుంటారన్నారు. జూన్ 4న ఉదయం 5గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఒక్కొక్క కౌంటింగ్ కేంద్రంలో గరిష్టంగా 14 మంది ఏజెంట్లను అనుమతిస్తారని చెప్పారు. ఫారం -17 సీలో నమోదు చేసిన ఓట్లను ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల సంఖ్యతో సరిచూస్తారని ,కౌటింగ్ సిబ్బంది ఆ సంఖ్య ఫారం 17 సీ పార్ట్ 2 నోట్ చేసుకుని దానిపై ఏజెంట్ల సంతం తీసుకుంటారన్నారు. అనంతరం ఈవీఎంల సీల్ తొలగించి రిజల్ట్ బటన్ నొక్కుతారన్నారు. ఈవీఎంలో పోలైన ఓట్లలో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయనే విషయం తెలుస్తుందన్నారు. ఒక్కొక్క రౌండ్‌లో ఏ అభ్య ర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయనే వివరాలను కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన బోర్డుపై సిబ్బంది రాస్తారని ,ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీసి భద్రపరుస్తారని తెలిపారు. శాంతియుతంగా లెక్కింపు ప్రక్రియ నిర్వర్తించడంలో అందరు సమష్టి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. జేసీ తేజ్ భరత్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లపై లేఅవుట్, రిటర్నింగ్ అధికారుల బాధ్యతలు నిర్వహించాల్సిన విధులు, భౌతిక ఏర్పాట్లపై సమగ్ర సమాచారాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో రాజమహేంద్ర వరం రూరల్, సిటీ ఆర్వోలు తేజ్ భరత్, దినేష్ కుమార్, కొవ్వూరు ఆర్వో అశుతోష్ శ్రీవాత్సవ్, డీఆర్వో జి.నరసింహులు, రాజానగ రం ఆర్వో చైత్రవర్షిణి, గోపాలపురం ఆర్వో శివజ్యోతి, అనపర్తి ఆర్వో ఎం. మాధురి, నిడదవోలు ఆర్వో రమణానాయక్, రాజమహేంద్రవరం పార్లమెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్‌డీసీ ఆర్.కృష్ణానాయక్, ట్రైనీ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు : ఎస్పీ

దివాన్‌చెరువు, మే20 : నన్నయ విశ్వవిద్యాలయంలో ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత , ఎస్పీ జగదీశ్ తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం ను సందర్శించి సోమవారం సాయంత్రం ఎస్పీ పి.జగదీశ్‌తో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వర్తించడంలో జవాబుదారీతనం, పారదర్శకతతో కూడిన ఏర్పాట్లు విష యంలో ఖచ్చితత్వం పాటించే విధానంలో చేపట్టవలసిన వాటిపై దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. మూడంచెల భద్రత నేపథ్యంలో చేపడు తున్న కార్యకలాపాలపై ఎస్పీ జగదీశ్‌తో కలిసి సమీక్ష నిర్వహించామన్నారు. అనంతరం విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకం చేశారు.స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి లెక్కింపు కేం ద్రానికి ఈవీఎంలు తీసుకు వచ్చే రూట్‌మ్యాప్‌పై చర్చించారు.



జిల్లా స్థాయి శిక్షణకు హాజరైన ఆర్వోలు

అర్చకుడి ఇంట్లో 30 కాసుల బంగారం చోరీ 6

గోదారిలో.. గరళం



అపవిత్రమవుతుందిలా: రాజమహేంద్రవరంలో మురుగంతా గోదారిలో కలిసేలా ఏర్పాటు చేసిన నల్లా చానల్ పైప్‌లైన్

పవిత్ర గోదావరి నీటి కోసం లక్షలాది మంది ఎదురు చూస్తున్నారు..ఆ నీరు కావాలంటూ అర్రులు చాస్తున్నారు.. అయితే రాజమహేంద్రవరంలో జరుగుతున్నది చూస్తే మాత్రం ఆ నీరు మాకొద్దు బాబోయ్ అంటారు. ఎందుకంటే.. రాజమహేంద్రవరం నగర ప్రజలు వాడిన నీటినే మళ్లీ శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. దీంతో చారిత్రక రాజమహేంద్రవరం నగరం సురక్షిత తాగునీటి సమస్యతో కొట్టుమిట్టాడుతోంది. నగరంలో 50 డివిజన్లలో సుమారు 4 లక్షల పైబడి జనాభా ఉన్నారు. గోదావరి పక్కనే ఉన్నా తాగునీటికి అల్లాడిపోతున్నారు. ఎందుకంటే నగరంలో 50 డివిజన్లకు నీటి సరఫరా చేసే ప్రధాన మంచినీటి విభాగానికి నగర ప్రజలు వాడిన నీరు కలిసే ప్రాంతానికి దూరం సుమారు 600 మీటర్లు మాత్రమే.. నగర ప్రజలు వాడిన నీరు గోదావరిలో కలిసే నల్లా చానల్ పాయింట్ గోదావరి ప్రవాహానికి ఎగువన ఉండగా, తాగునీటి కోసం లిఫ్ట్ చేసే ప్రధాన మంచినీటి విభాగం దిగువన ఉంది. దీంతో గోదావరి నీటిలో కలిసిన మురుగు నీటినే శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. ఆ నీటినే అందరూ తాగేస్తున్నారు.. పాలకులు మాత్రం ఆ మురుగునీరు కలిసే పాయింట్ మార్చేందుకు చర్యలు చేపట్టడం లేదు.



మురుగు గోదారిలో కలిసేదిలా

అఖండ గోదావరి.. అపవిత్రం

- రాజమండ్రిలో కలుస్తున్న మురుగు
- కలుషితమవుతున్న నీరు
- ఆ నీరే శుద్ధి చేసి తాగునీటిగా సరఫరా
- రోగాలతో ప్రజలు సతమతం
- నేటికీ పట్టించుకోని పాలకులు

రాజమహేంద్రవరం సిటీ, మే 20 : పవిత్రమైనది గోదావరి.. పేరులోనే పవిత్రం.. నదిలో మాత్రం ఆ పవి త్రత కానరావడం లేదు.. అధికారుల అలక్ష్యం.. పాలకుల నిర్లక్ష్యం.. అఖండ గోదావరికి శాపంగా మారాయి.. గోదా వరి నీటిలో ఏముంటుందో ఒక్కసారైనా నదిలో పుణ్యస్నానం చేయాలనే స్థాయి నుంచి..ఆ నీటిలో అడుగు పెడితేనే సర్వరోగాలు వస్తాయనే స్థాయికి దిగజారి పోయింది.. దీనికి కారణం పాలకులే.. ఎందుకంటే రాజమ హేం ద్రనగర ప్రజలు వాడే మురుగంతా కలిసేది జనం పవిత్రంగా భావించే గోదావరిలోనే.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే అతి ఎక్కువ ఆదాయం కలిగిన కార్పొ రేషన్ అయినా.. నేటికీ సమస్యకు మాత్రం పరిష్కారం చూపలేకపోయారు.. పైపై మెరుగులు అద్ది అభివృద్ధి చేసినట్టు చెప్పే పాలకులు గోదావరి పవిత్రత అపవిత్రమవుతున్నా కనీసం కన్నెత్తి చూడలేదు. రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి(గౌతమి) ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద ఏడు పాయలుగా విడిపోతోంది. అవి గౌతమి, వశిష్ఠ, వైనతేయ, ఆత్రేయ, భరద్వాజ, తుల్యభాగ, కశ్యప అనే సప్తర్షుల పేర్లతో పిలుస్తారు. అందుకే అంత పవిత్రత.. ఇందులో గౌతమి, వశిష్ఠ, వైనతేయ మాత్రమే ప్రవహించే నదులు.. మిగిలినవి అంతర్వాహినులు.. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది వద్ద సముద్రంలో కలుస్తోంది..అక్కడకు చేరే వరకూ గొంతు తడి పేందుకు ఈ నీరే.. చేను తడిపేందుకు ఈ నీళ్లే దిక్కు. అంత ప్రాధాన్యత ఉన్న గోదావరి రాజమహేంద్రవరం మురుగుతో అపవిత్రం అవుతున్నా కనీసం కదలిక లేదు.

గోదారున్నా.. తప్పని దాహం కేకలు

రాజమహేంద్రవరంలో అతి ముఖ్యమైనది సురక్షిత తాగునీటి సమస్య. దీనిని పరిష్కరించడంలో ఏ ఒక్కరు సఫలీకృతులు కాలేకపోయారు. టీడీపీ హయాంలో దిగువన ధవళేశ్వరం విజయ డైరీ ఎదురుగా ఒక 10 ఎమ్ఎల్‌డీ ప్లాంట్, కోటిలింగాల పేట టింబర్ యార్డ్‌లో ఒక 10 ఎమ్ఎల్‌డి ప్లాంట్ నిర్మాణాలు జరిగాయి. కానీ ప్రధాన మంచినీటి విభాగాన్ని గోదావరి ఎగువకు తరలించలేదు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినా అనంతరం వచ్చిన ప్రభుత్వాల వల్ల కార్యరూపం దాల్చలేదు.పూర్వపు కమిషనర్ విజయరామరాజు ప్రధాన మంచినీటి విభాగం ఇన్‌టెక్ పాయింట్‌ను పైప్‌ల ద్వారా నదిలోకి తీసుకువెళ్ళారు.కానీ నల్లా చానల్ గోదావరి మలుపులో ఉండడం వల్ల మురునీరు ప్రవాహం గోదావరి ఒడ్డు నుంచి మధ్య వరకు ప్రవహిస్తుంది. ఎలాగైనా ముగురునీరే తగులుతుంది. దీంతో ఆ మురుగునీరే శుద్ధి చేసి సరఫరా చేసే పరిస్థితి ఉంది. ప్రధాన మంచి నీటి విభాగం నుంచి 65 ఎంఎల్‌డీ వాటర్, మిగిలిన రెండు చోట్ల నుంచి 20 ఎమ్ఎల్‌డీ వాటరు కలిపి మొత్తం నగరంలో 85 ఎమ్ఎల్‌డీ వాటర్‌ను శుద్ధి చేసి నగర ప్రజలకు అందిస్తున్నారు.వేసవి వచ్చిందంటే గోదావరిలో నీరు తగ్గి కొంత ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి. తాగునీటి కొరత ఏర్పడుతుంది.

మురుగునీరే..శుద్ధి చేసి..

రాజమహేంద్రవరం ప్రజలు వాడిన మురుగు ప్రధాన డ్రైనేజీల గుండా తుమ్మలావ, ఆర్యాపురం ఎస్ఆర్‌సీపీ మీదుగా నల్లాచానల్‌కు చేరుకుటుంది. అక్కడ నుంచి నేరుగా గోదావరిలోకి వదులుతారు.. ఈ మురుగునీరు గోదావరిలో కలిసిపోతోంది. పుష్కరాల రేవు పక్కనే నగరపాలక సంస్థ ప్రధాన మంచినీటి విభాగం ఇంటెక్ పాయింట్ ఉంది. ఆ పాయింట్ వద్ద గోదావరి నీటితో కలి సిన మురుగు నీటినే తోడేసి శుద్ధి చేస్తుంది. నగరపాలక సంస్థ ఈ నీటినే తిరిగి నగరంలో ప్రజలకు సరపరా చేస్తున్నారు. దశాబ్దాలకుపైబడి రాజమహేంద్రవరానికి పీడిస్తున్న దీర్ఘకాలిక సమస్య ఇది. నగర ప్రజలు వాడిన మూత్రం, మలినాలతో కూడిన నీటినే ఇనేళ్ల పాటు ప్రజ లు తాగేస్తున్నారు. అలాంటిది నీరు కలిసే చోటు చూస్తే ఒల్లు గగుర్పొడుస్తుంది. నగరంలో ప్రజలు అధికంగా జబ్బుల బారిన పడడానికి పరోక్షంగా ఇదే కారణం కావొ చ్చు.ఇదిలా ఉంటే గోదావరి నీరు అపవిత్రత గురించి తెలియని చాలా ప్రాంతాల వారు గోదావరి నీరు కావా లని డిమాండ్ చేయడం గమనార్హం. గత ఎన్నికల సమ యంలో సీఎం జగన్ ఇచ్చిన హామీల్లో ఇంటింటికీ గోదా వరి నీరు ఒక ప్రధాన హామీ. ఆ హామీ నెరవేర్చలేదు. రాజమహేంద్రవరంలో సమస్యకు పరిష్కారం చూపలేదు.

నూతన ప్రజాప్రతినిధులకు సవాళ్లు

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చేనెల 4న వెలువడనున్న తరుణంలో కాబోయే ఎమ్మెల్యే,ఎంపీకి నగరంలో ఇదే ప్రధాన సమస్య. దీనిపై కసరత్తు చేసి ప్రజలకు సురక్షితమైన తాగునీరందించాల్సి ఉంది. 2003లో ప్రధాన మంచినీటి విభాగాన్ని కాతేరు సమీపంలోకి తరలించాలనే ప్రతిపాదనలు ఉన్నా నెరవేరలేదు. అటుపై అప్పటి నుంచి తాగునీటి సమస్య అలాగే ఉంది.గత ఐదేళ్లగా తాగునీటి సమస్య పరిష్కరిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూశారు. కానీ నిరాశ ఎదురైంది. 2024లో నూతన ప్రభుత్వమైన తాగునీటి విషయంలోను తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ఉన్న సుమారు 40 లక్షల మంది ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని గోదావరి కాలుష్యాన్ని నియంత్రించాల్సి ఉంది. అంతే కాకుండా మురుగునీరు గోదావరిలో కలవకుండా చేసి సురక్షిత తాగునీరందించాలనేది ప్రజల కోరిక .దానిని ఎంత మేరకు నెరవేరుస్తారో వేచి చూడాలి.

పౌల్ట్రీ పల్టీ



గుడ్డుకు..గడ్డుకాలం

పౌల్ట్రీ పరిశ్రమకు గడ్డుకాలం వచ్చిపడింది.. ఒకనాడు లాభాల బాటలో నడిచిన పరిశ్రమ నేడు నష్టాలనే చవి చూస్తోంది.. ఏ నెలకానెల సీజన్ వస్తుందని ఎదురు చూసినా కలిసిరావడంలేదు.. ఉత్పత్తి వ్యయం పెరగడం రాబడి తగ్గడం.. ఇతర రాష్ట్రాల్లో కూడా పరిశ్రమలు పెరగడంతో రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. చాలా ఏళ్లుగా పౌల్ట్రీ పరిశ్రమను తగ్గించుకుంటూ వెలుతున్నారు.. ఇదిలా ఉండగా ఇటీవల గుడ్డు రేటుపై ట్రేడర్స్‌రైతుల మధ్య ఏర్పడిన వివాదం తారస్థాయికి చేరింది.. నాలుగు రోజులుగా గుడ్లు ప్యాకింగ్ కాక నిల్వలు పేరుకుపోయాయి. ఇది ఎంత వరకూ దారి తీస్తుందోనని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.



- అయోమయంలో పౌల్ట్రీ రైతాంగం
- పెరిగిన మేత ధరలతో సతమతం
- ట్రేడర్ల ఇష్టారాజ్యం.. ధరలేక దిగాలు
- 4 రోజులుగా ప్యాకింగ్‌కు నిరాకరణ
- పేరుకుపోయిన గుడ్ల నిల్వలు
- పాలకులు స్పందించాలని డిమాండ్

అనపర్తి, మే 20 : ఒకప్పుడు వేలాది మందికి ఉపాధి కల్పించిన కోళ్ళ పరిశ్రమకు నేడు అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఉమ్మడి ఏపీలో ఎప్పటికప్పుడు మార్పులు తెస్తూ పరిశ్రమను అభివృద్ధి పదాన నడిపించిన రైతులు నేడు విభజిత ఏపీలో పరిశ్రమ మనుగడపై మీమాంసలో పడే స్థాయికి చేరుకున్నారు, ఏపీలో తయారయ్యే గుడ్డుకు జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉండేది. మన రాష్ట్రం నుంచి ఎగుమతి అయ్యే గుడ్ల కోసం ట్రేడర్లు పరుగులు పెట్టేవారు. నేటి పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా మారింది. ఇక్కడ నెక్ జోన్ ప్రకటించిన రేటుకు గుడ్లు కొనే పరిస్థితి నుంచి లోడు చేరిన తరువాత అక్కడి ట్రేడర్లు రేటు నిర్ణయించే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏడాదిలో మూడు నెలల సీజన్ కోసం రైతులు ఎదురు చూసేవారు. నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో గుడ్డు రేటు పెరగడం ఏడాదిలో మూడు నెలలతో వచ్చిన లాభంతో మిగిలిన నెలల్లో వచ్చిన ఒడిదుడుకులను రైతులు ఎదుర్కొనేవారు. ప్రస్తుతం ఏడాదంతా ఒకే పరిస్థితి నెలకొనడంతో పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.ఏపీలో పెరిగిన ఫీడ్, మందులు, ఇతర ఖర్చులకు కనీసం గుడ్డు ధర రూ రూ.6ల నుండి రూ.7ల వరకు పలికితే తప్ప పౌల్ట్రీని నడిపే స్థితిలో రైతులు లేరనడంలో సందేహం లేదు. పేపరు ధరకు రూ.1 నుంచి రూ.2ల వరకు ఆదనంగా విక్రయాలు మార్కెట్‌లో జరగడంతో వినియోగదారుడు మాత్రం గుడ్డుకు రూ.6 నుంచి రూ. 7ల వరకు చెల్లించాల్సి వస్తుంది.రైతులు నష్టాలు పాలవుతున్నా వినియోగదారుడికి ఒరిగిందేమీ లేదు.

ఇతర రాష్ట్రాల్లో పెరిగిన పరిశ్రమ

గతంలో ఒరిస్సా రాష్ట్రంలో 15 లక్షలకే పరిమితమైన కోళ్ల పరిశ్రమ నేడు 1.50 కోట్ల కోళ్ళతో రోజుకు సుమారుగా 1.20 లక్షల గుడ్లు ఉత్పత్తి చేసే స్థాయికి చేరుకుంది. బీహార్, బెంగాల్, ఉత్తర ప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లో కూడా కోళ్ల పరిశ్రమలు పెరగడం అక్కడ గుడ్డుకు రూ.6లు పలకడంతో అక్కడి రైతులు కోళ్ళ సంఖ్యను మరింత పెంచేందుకు ఆసక్తి చూపుతున్నారు. తమిళనాడులో కూడా కోళ్ళ పరిశ్రమ మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. అయితే అక్కడి నుంచి కేరళ, కర్నాటక రాష్ట్రాలకు గుడ్లు సరఫరా జరుగుతుండడంతో పరిశ్రమ ఒడిదుడుకులు లేకుండా సాగుతుంది.

మేత ధరలతో రైతులు కుదేలు

కోళ్ళ దాణాకు వినియోగించే నూక, మొక్క జొన్న ధరలు విపరీతంగా పెరగడం రైతులకు పెనుభా రంగా మారింది.రూ.వెయ్యి నుంచి రూ.1200ల వరకు లభ్యమయ్యే వీటి ధర రూ.2500 నుంచి రూ.3 వేల వరకు పెరగడంతో ఉత్పత్తి వ్యయం పెరిగి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. టన్ను దాణా సుమారుగా రూ.30 వేల వరకు రైతులు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాణా రేట్లు తట్టుకోలేని కొందరు రైతులు తమ ఫారంలోని కోళ్ళలో సుమారు 25 నుంచి 30 శాతం వరకు మౌల్డింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు ప్రస్తుత ఎండ వేడిమితో బాటు అనేక రుగ్మతల వల్ల చనిపోతున్న కోళ్ళ సంఖ్య గణనీయంగా పెరగడంతో రైతులు విపరీతమైన నష్టాలు చవిచూస్తున్నారు. కోళ్ళ మందుల ధర కూడా పెరగడం తో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నష్టాలకు భయపడి జిల్లాలో అనేక మంది రైతులు కోళ్ళ సంఖ్యను తగ్గించుకున్నారు.

పొరుగు రాష్ట్రాల్లో రాయితీలు

కోళ్ళ పరిశ్రమను ప్రోత్సహించేందుకు అనేక రాష్ట్రాలు రాయితీలు ప్రకటిస్తుండగా.. మన రాష్ట్ర ప్రభు త్వం ఎటువంటి రాయితీలు అందించడంలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో విద్యుత్ యూనిట్‌కు రాయితీ పోను సుమారుగా రూ.4లు చెల్లించేవారు. ప్రస్తుతం యూనిట్‌కు రూ.8 నుంచి రూ.9ల వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు ఒక్క విద్యుత్ చార్జీలే నెలకు రూ.4 లక్షలు అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి. కోళ్ళ రైతులు తీసుకునే బ్యాంక్ రుణాలపై ప్రభుత్వం కొన్ని రాయితీలు అందించి వారికి వడ్డీలో ఉపశమనం కల్పించేది. కానీ 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా తొలగించడంతో పరిశ్రమపై భారం పడింది. కోళ్ల పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ఫలితం లేకపోయిందని పలువురు రైతులు వాపోయారు. 2024లో ఏర్పడే నూతన ప్రభుత్వం కోళ్ళ రైతుల కష్టాలను అర్థం చేసుకుని కొన్ని రాయితీలు అందిస్తుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు.

4 రోజులుగా గుడ్ల ప్యాకింగ్‌కు బ్రేక్

కోళ్ళ ఫారాల వద్ద గుడ్ల నిల్వలు పేరుకుపోతున్నాయి. పేపరు ధర రూ.5.10 పైసలు ఉన్నప్పటికీ రైతులకు మాత్రం ఇన్‌కమింగ్ రేటు ప్రకారం సొమ్ములు చెల్లిస్తామని అది రూ.4.70 వరకు ఉంటుందని ట్రేడర్లు చెప్పడంతో నాలుగు రోజులుగా రైతులు గుడ్లు ప్యాకింగ్‌కు నిరాకరించారు.దీంతో నిల్వలు పెరిగాయి. ఏపీ రైతు లు కేవలం కలకత్తా మార్కెట్‌పైనే ఆధారపడి ఉండ డంతో అక్కడి ట్రేడర్లు ఆడిందే ఆటగా ఉందని కొందరు రైతులు వాపోతున్నారు.కలకత్తా సమీప రాష్ట్రాల నుంచి గుడ్లు ఎక్కువ ఉత్పత్తి కావడంతో కల కత్తా ట్రేడర్లు ఏపీ గుడ్లపై ఆసక్తి చూపడంలేదని.. ఖచ్చితమైన ధర చెల్లించడం లేదని రైతులు వాపోతున్నారు.



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లతో ఎస్పీ జగదీశ్

281 సెల్‌ఫోన్‌లు రికవరీ

రాజమహేంద్రవరం, మే 19(ఆంధ్రజ్యోతి): చోరీకి గురైన/పోగొట్టుకున్న 281 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేయగా ఆయా ఫోన్‌లు ఎస్పీ జగదీశ్ యజమానులకు అందజేశారు.అనంతరం మాట్లాడుతూ ఇటీవల సెల్‌ఫోన్ల చోరీలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తుండడంతో అడిషనల్ ఎస్పీ(క్రైమ్స్) టి.సర్కార్, డీఎస్పీ (క్రైమ్స్) శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేశామన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సీఈఐ ఆర్ వెబ్ పోర్టల్ సహాయంతో ఫోన్లు రికవరీ చేశామని తెలిపారు. చోరీకి గురైన సెల్‌ఫోన్లను కేరళ, కర్నాటక, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి తీసుకు రావడం జరి గిందన్నారు. చాట్‌బోట్ వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ నాలుగు విడతల్లో రూ.2.52 కోట్ల విలువ చేసే 1393 సెల్‌ఫోన్‌లు రికవరీ చేశామన్నారు.ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలతో పాటు ఐటీ కోర్ టీం ఎస్ఐ అయ్యప్పరెడ్డి, కానిస్టేబుల్స్ ప్రియాంక, గౌతమి, శ్యామల,కిరణ్, గౌతమ్ తదితర సిబ్బందిని అభినందించారు.

జిల్లాలో విస్తృతంగా కార్డన్ సెర్చ్

రాజమహేంద్రవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ చేపడుతున్నామని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకూ ప్రతి రోజూ ఈ సోదాలు జరుగుతాయన్నారు. ఇప్పటికే నిఘా పటిష్టం చేశామన్నారు. మద్యం, బాణసంచా, ఆయుధాల అక్రమ నిల్వలపై తనిఖీలు ముమ్మరం చేశామని చెప్పారు. పెట్రోలు బంకుల్లో పెట్రోలు, డీజిల్‌ని బాటిల్స్‌లో నింపరాదన్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన రూ.10,950 విలువ చేసే బాణసంచా, నెంబరు, రికార్డు లేని 66 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం, సారా, బాణసంచా వంటి వాటిపై 100, 112కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

డిపోలకు చేరని పుస్తకాలు

ధవళేశ్వరం, మే 20 : విద్యాసంవత్సరంలో 1 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించాల్సిన పాఠ్యపుస్తకాలు పూర్తి స్థాయిలో డిపోలకు చేరలేదు.ధవళేశ్వరంలోని గవర్నమెంట్ బుక్ డిపో నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ, కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని పాఠశాలలు అందించాల్సిన పుస్తకాలను ఆయా జిల్లాల పరిధిలోని మండల విద్యా కేంద్రాలకు బుధవారం నుంచి తరలిం చాల్సి ఉంది. 1 నుంచి 7వ తరగతి వరకు 14,74,539 మొదటి సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలి. ఇప్పటికే పలు పుస్తకాలు డిపోలకు చేరగా మరిన్ని పుస్తకాలు దశల వారీగా 4 జిల్లాలకు పంపిణీ చేస్తామన్నారు.10వ తరగతి సిలబస్ మారిన దృష్ట్యా కొత్తపుస్తకాలు ముద్రణాలయాల నుంచి మండల విద్యాకేంద్రాలకు తరలించనున్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

పెరటి తోటలతో ఇంటి వద్దనే కూరల సాగు

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ రమణమూర్తి



దొమ్మేరులో స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

కొవ్వూరు, మే 20: పెరటి తోటల పెంపకం ద్వారా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు ఇంటి వద్దనే పండించుకోవచ్చునని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ కేవీ రమణమూర్తి అన్నారు. సోమవారం కొవ్వూరు మండలం దొమ్మేరులో అచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాలల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పెరటి తోటల పెంపకంపై రైతులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. రమణమూర్తి మాట్లాడుతూ పెరటి తోటలు పెంపకంతో కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు కేఎం దక్షిణామూర్తి, సీహెచ్ సునీత, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

పిల్లలకు ప్రత్యేక తరగతులు

పెరవలి, మే 20: వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమంలో భాగంగా ముక్కామల, తీపర్రు శాఖా గ్రంథాలయాల్లో పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ నాలెడ్జ్ వివిధ రకాల ఆటలు ఆడించారు. ముక్కామలలో జరిగిన కార్యక్రమంలో రిసోర్సుపర్సన్ కరుటూరి విశ్వనాథం, కె.భవాని, మధులీ, గ్రంథాలయాధికారి ఎం.వెంకటేశ్వరరావు, జయలక్ష్మి పాల్గొన్నారు.

జీవీ కుటుంబానికి పరామర్శ



తాళ్లపూడి, మే 20: మండలంలోని అన్నదేవరపేటకు చెందిన టీడీపీ నాయకుడు జీవీ కుటుంబాన్ని ఆ పార్టీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి పరామర్శించారు. జీవీ తండ్రి వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. సోమవారం ఉదయం సుబ్బరాయచౌదరి జీవీ నివాసానికి చేరుకుని పరామర్శించి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో పొట్రు శ్రీనివాసరావు, కొరారు వెంకట్రావు, నామాన పరమేశ్వరరావు, అన్నమరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు. అలాగే జీవీని జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, నాయకులు చెవ్వూరి బంగ్రారాజు, నేలపాటి పద్మ, ఎలుగుబంటి బాలకృష్ణ, పి.సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎండీ రఫీయుల్లాబేగ్ తదితరులు పరామర్శించారు.



నిడదవోలు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

నిడదవోలు, మే 20: నిడదవోలులోని కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పొడుగు శ్రీరామమూర్తి, అధ్యక్షుడిగా గోలి రామబ్రహ్మం, ప్రధాన కార్యదర్శిగా ఎన్‌వీవీ సత్యనారాయణ, కోశాధికారిగా లావేటి జేజీ శివన్నారాయణ, ఉపాధ్యక్షుడిగా కొమ్మోజు చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా పొడుగు నరేష్, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్టు సంక్షేమం సంఘం ఓ ప్రకటనలో తెలిపింది.

నిడదవోలులో భారీ వర్షం



నిడదవోలులో జలమయమైన రోడ్డు

నిడదవోలు, మే 20: నిడదవోలులో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ జలమయమ య్యాయి. డ్రైన్లు పొంగి పొర్లాయి. రోడ్లు జలమయం కావడంతో వాహనదార్లు ఇబ్బందులు పడ్డారు.

టీడీపీ గోపాలపురం అధ్యక్షుడి పుట్టినరోజు



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న యువకులు

గోపాలపురం, మే 20: టీడీపీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారా యణ పుట్టినరోజును రొంగలి యూత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కేక్ కోసి కార్యకర్తలకు మిఠాయిలు పంచారు. అనంతరం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, గ్రామంలోని వృద్ధులకు, దివ్యాంగులకు పండ్లు, రొట్టెలను యూత్ సభ్యులు అందించారు. కార్యక్రమంలో కూనపాము ప్రసాదబాబు, మల్లిపూడి సుబ్బారావు, రొంగలి చిన్న, కొడవటి గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడి ఇంట్లో భారీ చోరీ

30కాసుల బంగారం, వెండి వస్తువుల అపహరణ

అనపర్తి, మే 20: మండలం పొలమూరులో ఇంటికి తాళాలు వేసుకుని తీర్థయాత్రలకు వెళ్లిన అర్చక కుటుంబం ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండి వస్తువులను దోచుకుపోయారు. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుండు వెంకటరమణయ్య స్థానిక ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు.ఈనెల 14న ఇంటికి తాళాలు వేసుకుని కుటుంబంతో సహా తీర్థయాత్రలకు వెళ్లాడు. ఈ నెల 19న పనిమనిషి అప్పయ్యమ్మ ఆయనకు ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని చెప్పడంతో రమణయ్య తీర్థ యాత్రలు మధ్యలోనే ముగించుకుని సోమవారం ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు, బీరువా తెరచి ఉండడం సామాన్లు చెల్లా చెదురుగా ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. బీరువాలోని 30కాసులు బంగారు ఆభరణాలు, కొన్ని వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ శివగణేష్ ఎస్‌ఐకు పలు సూచనలు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

2 గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం



రాజమహేంద్రవరం, మే 19(ఆంధ్రజ్యోతి): రెండు గుర్తు తెలియని మృతదేహాలు లభ్యమయ్యాయని ప్రభుత్వ రైల్వే పోలీస్(జీఆర్పీ) సీఐ విజయ్ శంకర్ తెలిపారు. గూడ్స్ షెడ్ సమీపంలో సుమారు 40ఏళ్ల కలిగిన వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా ప్రభుత్వాస్పత్రికి తరలించామ న్నారు. చికిత్స పొందుతూ మరణించాడన్నారు. ద్వారపూడి-కడియం రైల్వే స్టేషన్ల మధ్యలో ట్రాక్‌పై పడి ఉన్న మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలిం చామన్నారు.వివరాలు తెలిసిన వారు ఫోన్ నెంబర్ 9440627551, 9491444022కి సమాచారం అందించాలని సీఐ కోరారు.

ప్రకాశం పంతులుకు నివాళి

ఉండ్రాజవరం, మే 20: ఉండ్రాజవరంలోని శాఖా గ్రంథాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 67వ వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. తెలుగు పండిట్ చెరుకూరి వెంకటకృష్ణప్రసాద్ ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు ఆశయాలను ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని పలువురు వక్తలు కోరారు. కార్యక్రమంలో లైబ్రరీ కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాసరావు, గ్రంథపాలకుడు జి.కృష్ణారావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తూచ్..తూగోజిది కాదు!

- ఇసుక అక్రమ తవ్వకాలపై తప్పించుకునే యత్నం
- తీపర్రు, ఉసులుమర్రు ర్యాంపుల్లో యథేచ్ఛగా తవ్వకాలు
- ఇటీవల పరిశీలించిన తూర్పు అధికారులు
- ఆ సరిహద్దు కోనసీమదంటూ దాటవేత
- అది తప్పు అంటున్న రెండు గ్రామాల ప్రజలు



తీపర్రు ర్యాంప్‌లో ఇటీవల సాగుతున్న ఇసుక తవ్వకాలు (ఫైల్)

పెరవలి, మే 20: గోదావరి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆయా శాఖల అధికారుల్లో కదలిక వచ్చి ఆగమేఘాలపై పరుగులు తీశారు. అయితే తిమ్మిని బమ్మిని చేసి అక్రమాలు గుట్టు తేలకుండా అంతా సవ్యంగానే ఉన్నట్టు నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే తీపర్రు ఇసుక ర్యాంప్‌లో మూడు నెలలుగా జరిపిన ఇసుక అక్రమాలుపై తీపర్రు, ఉసులుమర్రుకు చెందిన ప్రజానికం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ అంచనాలతో ఇష్టారాజ్యంగా వందలాది లారీలు ఇసుక తవ్వుకుని పోతుంటే ఏమి పట్టనట్టు వ్యవహరించిన అధికార యంత్రాంగం సాఫీగా వచ్చి ఏమీ జరగనట్టుగా ఉండడం విడ్డూరమని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడ అక్రమ తవ్వకాలకు తామే సాక్ష్యమని, ఏ అధికారి వచ్చినా ఏ మేరకు ఇసుక తవ్వకాలు జరిగాయో చెబుతామంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా వైపునకు తీపర్రు గ్రామం చేరచేర్చి ఉన్నప్పటికీ ఇసుక తవ్వకాలు అన్ని కోనసీమ జిల్లా పరిధిలో జరిగినట్టు అధికారులు చెప్పడం విడ్డూరమంటున్నారు. గత 30 ఏళ్లుగా ఇక్కడ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, ఇటువంటి పరిధులు ఎప్పుడూ అధికారులు నుంచి వినలేదని చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి వివిధ శాఖల అధికారులే ఇక్కడ తనిఖీలు జరిపి కేసులు నమోదు చేసేవారని, అక్రమ తవ్వకాలపై జరిమానాలు కూడా విధించేవారని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం దానికి విరుద్ధంగా కొత్త జిల్లాలు ఏర్పడిన అనంతరం ఈ ప్రాంతం తూర్పుగోదావరిలోకి, గోదావరి అవతలి ప్రాంతం కోనసీమ జిల్లాలోకి మారాయి. దీంతో అవతలి వైపు భాగాన్ని కోనసీమ జిల్లా అధికారులు పరిశీలించాలని ఇక్కడి అధికారులు చేతులు దులుపుకోవడం సబబు కాదని పేర్కొంటున్నారు. అయితే కోనసీమ జిల్లా అధికారులైనా స్పందించి ఈ ప్రాంతానికి వచ్చి విచారిస్తే తాము సాక్ష్యాధారాలతో అక్రమ తవ్వకాల బాగోతం బయట పెడతామని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు. ప్రతిమ కంపెనీకి 2025 సంవత్సరం వరకు అనుమతులు ఉన్నాయని చెబుతున్న అధికారులు అసలు ఆ కంపెనీకి ఏ జిల్లా అధికారులు అనుమతులు ఇచ్చారో, దానికి నిర్ణయించిన పరిధులు ఏమిటో, ఎన్ని క్యూబిక్ మీటర్లు ఉంటాయో తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా అధికారుల అనుమతి పొంది కోనసీమ జిల్లా పరిధిలో ఇసుక తవ్వకాలు జరిపితే అవి అక్రమ తవ్వకాలే కాబట్టి వెంటనే కోనసీమ జిల్లా అధికారులు స్పందించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాలు తమతోపాటు తూర్పుగోదావరి జిల్లా మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు కూడా సాక్ష్యం చెబుతారని, అక్రమంగా తవ్విన ఇసుక గుట్టలు కూడా నిడదవోలు-నరసాపురం రహదారి పక్కన ఉన్నాయని పేర్కొంటున్నారు. కోనసీమ జిల్లా అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని, ఆ గుట్టలు కూడా తరలిపోతే ఇసుక అక్రమ తవ్వకాల సాక్ష్యం లేకుండా పోతుందని పేర్కొంటున్నారు.

జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమలు

- కొవ్వూరు పట్టణ సీఐ జగదీశ్వరరావు
- వాడపల్లి బంగారమ్మపేటలో కార్డన్ అండ్ సెర్చ్
- సరైన రికార్డులు లేని 6 వాహనాలు సీజ్



కార్డన్ అండ్ సెర్చ్‌పై సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ జగదీశ్వరరావు



బంగారమ్మపేటలోని ఓ ఇంటిలో తనిఖీలు చేస్తున్న సీఐ, సిబ్బంది

కొవ్వూరు, మే 20: జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, నియోజకవర్గంలో ఎటువంటి ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని సీఐ జగదీశ్వరరావు తెలిపారు. డీఎస్పీ కేసీహెచ్ రామారావు ఆధ్వర్యంలో కొవ్వూరు పట్టణ, మండల సీఐలు జగదీశ్వరరావు, పి.శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి సోమవారం మండలంలోని వాడపల్లిలోని బంగారమ్మపేటలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. పోలీసు సిబ్బంది ప్రతి ఇంటిని తనిఖీచేశారు. సరైన రికార్డులు లేని ఆరు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ జగదీశ్వరరావు మాట్లాడుతూ సాధారణ ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్డెన్ అండ్ సెర్చ్‌లో భాగంగా బంగారమ్మపేటలో తనిఖీలు నిర్వహించామన్నారు. ఎన్నికల కౌంటింగ్‌కు ముందుగాని, తరువాత గాని అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్‌తో పాటు 30 పోలీసు యాక్టు, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. తనిఖీల్లో పట్టణ, రూరల్ ఎస్‌ఐలు జుబేర్ మహ్మద్, కె.సుధాకర్, చాగల్లు ఎస్‌ఐ, మూడు స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

పెరవలి, మే 20: అన్నవరప్పాడులో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు రెండో రోజు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఉండ్రాజవరం: వేలివెన్ను గ్రామంలో భూదేవి శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి కళ్యాణం ఘనంగా జరిగింది. తొలుత స్వామివారికి లక్ష పత్రి పూజలు, అభిషేకాలు చేశారు. వాహనాన్ని ప్రత్యేకంగా అలంకరించి వాయిద్యాల సందడిలో స్వామివారిని పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రసాదాలు అందజేసింది.

భారీ అన్నసమారాధన

దేవరపల్లి, మే 20: దేవరపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం భారీ అన్న సమారాధన జరిగింది. ఉదయం నుంచి భక్తులు స్వామివారిని అమ్మవార్లను దర్శించుకున్నారు. అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా ఆలయాభివృద్ధికి గౌరీపట్నం గ్రామానికి చెందిన కొర్లపాటి సుబ్రహ్మణ్యం, అరుణ దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, వెలగా శ్రీనివాస్, గుడ్ల వెంకటేశ్వరరావు, కె.కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లులో వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ వేడుకలు అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు ఆలపాటి సాంబశివరావు, కిషోర్ కుటుంబ సమేతంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో రూ.లక్ష విరాళం అందజేస్తున్న సుబ్రహ్మణ్యం, అరుణ దంపతులు



చాగల్లులో నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

హైకోర్టు బార్ లైబ్రరీ సెక్రటరీగా కోదాటి



రాజమహేంద్రవరం సిటీ, మే 20: రాజమహేంద్రవరానికి చెందిన న్యాయవాది కోదాటి రమ్యకృష్ణ ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీగా ఎన్నికయ్యారు. హైకోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఆమె 787ఓట్లతో గెలుపొందారు. ఏప్రిల్ 30న అమరావతిలో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో లైబ్రరీ సెక్రటరీగా ఎన్నికైన మొదటి మహిళా న్యాయవాదిగా గుర్తింపు పొందారు.

కోటిలింగాల ఆలయ సమీపంలో ఈట్‌స్ట్రీట్ వద్దు

రాజమహేంద్రవరం సిటీ, మే 20: కోటిలింగాల దేవస్థానం సమీపంలో గోదావరి గట్టుపై ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేయవద్దని రాజమహేంద్రి వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ కన్వీనర్ టీకే విశ్వేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి గట్టువెంబడి మాంసాహార వంటకాలను ఎట్టిపరిస్థితుల్లో విక్రయించడానికి వీల్లేదన్నారు. దీనిని పట్టించుకోకపోతే ఆందోళన చేపడతామన్నారు.ఈ సమావేశంలో కెకె సంజీవరావు, మాదిరాజు శ్రీనివాస్, దేశిరెడ్డి బలరామనాయుడు, కమిటీ కన్వీనర్ కృష్ణకుమార్, సభ్యులు పట్నాయక్, ఎల్వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులతో మర్యాదగా నడుచుకోవాలి

డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు



వృద్ధుడికి గుర్తింపు కార్డు అందజేస్తున్న ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, మే 19(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలని, వృద్ధుల పట్ల గౌరవంగా నడుకోవాలని.. లేదంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. అవసరాలను తీర్చకపోయినా, అమర్యాదగా చూసినా చట్టాన్ని ఆశ్రయించే హక్కు వారికి ఉందని తెలిపారు. వయోవృద్ధుల హక్కుల పరిరక్షణపై డీఎల్‌ఎస్‌ఏలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. నల్సా వయోవృద్ధుల న్యాయ సేవల పథకం-2016పై అవగాహన కల్పించారు. వివిధ రకాల దస్తావేజులు, రద్దు ప్రక్రియలు, రివర్స్ మార్ట్‌గేజ్ తదితర అంశాలను వివరించారు.35 మంది వయోవృద్ధులకు గుర్తింపు కార్డులు అందజేశారు.

అక్టోబరు, డిసెంబరులో చెస్ పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, మే 20 : అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో భాగంగా భారతీయ నవీన క్రీడా ఉత్సవ్ (బీఎన్‌కేయూ) ట్రస్టు ద్వారా ఈ ఏడాది అక్టోబరు 19 నుంచి 25 వరకూ, డిసెంబరు 24 నుంచి 26వ తేదీ వరకూ రెండు అంతర్జాతీయ చెస్ పోటీలు నిర్వహించనున్నామని ట్రస్టు కార్యదర్శి విత్తనాల కుమార్ వెల్లడించారు. రాజమహేంద్రవరంలోని కాలఫ్యూషన్ చెస్ అకాడమీలో సోమవారం మాట్లాడారు. ట్రస్టు ద్వారా రాష్ట్రంలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించి పేద క్రీడాకారులకు ఆర్థికంగా చేయూత ఇస్తున్నామన్నారు. సమావేశంలో ట్రస్టు కోశాధికారి టి.నరేష్‌కుమార్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.భీమారావు, ఏ.ఉదయ్‌కుమార్‌నాయుడు, చెస్ ఆర్గనైజర్లు లీలాకుమార్, మనోహర్ పాల్గొన్నారు.

గైట్‌లో 79 మందికి ఉద్యోగాలు

రాజానగరం, మే 20: క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తమ కళాశాలకు చెందిన 79 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ లూకాస్ టీవీఎస్ సంస్థ గైట్ కళాశాలలో సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించిందన్నారు. ఈఈఈ, మెకానికల్, ఆటో మొబైల్ ఇంజనీరింగ్ విభాగాలతో బీటెక్, పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులు పాల్గొన్నారని, ఎంపికైన వారంతా త్వరలోనే ఉద్యోగాల్లో ప్రవేశిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎన్.లీలావతి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పీజీ రామానుజమ్ తదితరులు అభినందించారు.

ఉపాధి కూలీకి పాముకాటు.. వైద్యం

కడియం, మే 20: పాముకాటుకు గురైన ఉపాధి కూలీకి సీహెచ్‌సీతో వైద్యం చేశారు. కడియంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా కాలువ పనులు చేస్తుండగా నీలగిరి సత్యనారాయణ అనే కూలీ పాముకాటుకు గురయ్యాడు. విషయం తెలియగానే ఎంపీడీవో రాజ్‌మనోజ్ స్థానిక సీహెచ్‌సీకి వెళ్లి డాక్టర్ శివశంకర్‌తో మాట్లాడి వైద్యసేవలు అందించారు. సత్యనారాయణ ఆరోగ్యపరంగా కోలుకునే వరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిబంధనల మేరకు మస్తరు వేస్తామని ఈ సందర్భంగా ఎంపీడీవో తెలిపారు.

కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

రాజమహేంద్రవరం అర్బన్, మే 20: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. ఈ మేరకు పీడీఎస్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ విద్యాసంస్థల ఫ్లెక్సీలను తొలగించాలని కోరారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులకు ఒక వినతిప్రతం అందజేసినట్టు పేర్కొన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

దేవరపల్లి, మే 20: దేవరపల్లి ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించగా త్యాజంపూడిలో 10 మద్యం సీసాలతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ కేవీ స్వామి తెలిపారు. ఎక్కడైనా మద్యం అమ్మకాలు జరిగితే సమాచారం అందించాలన్నారు. బెల్ట్‌షాపుల నియంత్రణకు సహకరించాలని కోరారు. దాడుల్లో ఎస్‌ఐ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

రంగంపేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ హేమ



రంగంపేట, మే 20: రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024 -25 విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ బి.హేమ సోమవారం తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు తెలుగు, ఇంగ్లీషు మీడియంలో అందుబాటులో ఉన్నాయని, ఒక్కొక్క గ్రూపు నుంచి 100కు పైగా సీట్లు ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు లభిస్తాయన్నారు. తమ కళాశాలలో విశాలమైన తరగతి గదులు, గ్రంథాలయం, ప్రయోగశాలలు, మినరల్‌వాటర్, అధునాతన టాయ్‌లెట్లు, విశాలమైన ఆటస్థలం వంటి సౌకర్యాలు ఉన్నాయన్నారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా అనుభవజ్ఞులైన అధ్యాపకులతో మెరుగైన విద్యాబోధన అందిస్తామని ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



కడియం గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కడియం, మే 20: కడియం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరం సోమవారం ఆరో రోజుకు చేరింది. గ్రంథాలయాధికారిణి శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పుస్తకపఠనం చేయించారు. సచివాలయ, 108 సిబ్బంది.. విద్యార్థులకు కథ వినడం, పుస్తక సమీక్ష, సోషల్ వివరణ గురించి తెలిపారు.

సురక్షితంగా కోర్టులో హాజరుపర్చాలి

దివాన్‌చెరువు, మే 20: అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లేందుకు ప్రయాణంలో ఉన్న తమ పార్టీ అజ్ఞాతదళ నాయకులు రాజన్న, జీవన్, దేవ్‌రెడ్డిలతో బాటు మరొకరిని గతరాత్రి పోలీసులు వరంగల్ జిల్లా సరిహద్దులో అక్రమంగా అరెస్ట్ చేశారని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సంయుక్త కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అరెస్ట్ చేసిన వారికి ఎటువంటి ప్రాణహాని తలపెట్టకుండా వెంటనే కోర్టులో హాజరుపర్చాలని తెలంగాణా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఏజెన్సీ ప్రాంతంలో కొనసాగుతున్న కూంబింగ్‌ను తక్షణమే నిలిపి వేయాలని కూడా డిమాండ్ చేస్తున్నామన్నారు.

వీరభద్రస్వామి తీర్థ మహోత్సవాలు



రంగంపేటలో వీరభద్రస్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రంగంపేట, మే 20: రంగంపేటలోని శ్రీసాయినగర్‌లో వీరభద్రస్వామి వార్షిక తీర్థ మహోత్సవాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయార్చకులు.. భక్తులు వట్టికూటి రాజేంద్రప్రసాద్, శ్రీలక్ష్మిలతో స్వామివారి ప్రతిరూపమైన విభూతి పండుకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వామి వారి చిత్రపటాన్ని డప్పువాయిద్యాలు, బాణసంచాకాల్పులతో ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. ఈ నెల 27న ప్రత్యేక పూజలు, అన్నసమారాధన చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ రాత్రి భజన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బొట్టు స్వామి, యానాపు త్రిమూర్తులు, కేతా సత్యనారాయణ, కొండి జమీ, చెక్కపల్లి శివ, సియాకుల దుర్గాప్రసాద్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతానగరం, మే 20: మిర్తిపాడు రూరల్ ఫీడర్ 11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ శ్రీధర్ వర్మ తెలిపారు. బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	లవ్‌గురు
వై.స్క్రీన్2	ఫ్యామిలీ స్టార్
దేవిశ్రీ(గాయత్రి)	మంజుమ్మల్ బాయ్స్
అనన్య	డీజే టిల్లు-2

నిడదవోలు

వీ మ్యాక్స్	గాడ్జిల్లా వర్సెస్ కాంగ్
రాధాకృష్ణ	ఆ ఒక్కటి అడక్కు
శ్రీగణపతి	గీతాంజలి మళ్లీ వచ్చింది

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి